



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక  PEN POWER TELUGU DAILY  ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11  సంచిక : 354  పేజీలు : 12  సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ)  ప్రచురణ : విశాఖపట్నం  బుధవారం 27 ఆగస్టు 2025  వెల : 5/-రూ॥
VOLUME :11  ISSUE :354  PAGES : 12  EDITOR : G. A. RAO ( ANAND GANTYADA )  PUBLISHED : VISAKHAPATNAM  WED 27 AUGUST 2025  PRICE : 5/- RS
Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur




# రొటీన్ సమావేశాలు వద్దు..
# ప్రజల కోసం పనిచేయండి

## బ్యాంకర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం




- బ్యాంకర్ల తీరుపై సీఎం చంద్రబాబు అసంతృప్తి
- సీజన్ చివర్లో రైతులకు రుణాలిస్తే ఏం ప్రయోజనమని ప్రశ్న
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలని హితవు

పెన్ పవర్ డెస్క్:కేవలం సమావేశాలు నిర్వహించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండద ని... బ్యాంకులు తమ నిర్ణయాలను ప్రజలు, రైతులు, ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా తీసుకోవాలని ముఖ్య మంత్రి చంద్రబాబు సూచించారు. సచివాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశంలో మా ట్లాడుతూ, బ్యాంకర్లు తమ పనితీరును మార్చుకోవాల్సిన సమయం ఆసన్న మైందని ఆయన అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటికే సగం కాలం గడిచి పోయిందని, ఈ సమయంలో రైతులకు అండగా నిలవాల్సిన బ్యాంకులు సీజన్ చివరిలో రుణాలు మంజూరు చేస్తే ప్రయోజనం ఉండదని చంద్రబాబు అన్నారు. "రైతులకు అవసరమైనప్పుడు రుణాలు, ఇతర ఇన్‌పుట్‌లు అందించాలి. కాలం దాటిపోయాక ఇచ్చే రుణాలతో వారికి ఉపయోగం శూన్యం" అని ఆయన చెప్పారు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా బ్యాంకులు కూడా కొత్త ఆవిష్కరణల దిశగా ఆలోచించాలని, నూతన సంస్కరణలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. దేశ ఆర్థిక వ్యవస్థ అమెరికా, చైనా వంటి దేశాలకు సవాలు విసిరేలా ఎదుగుతోందని, ఈ అభివృద్ధిలో బ్యాంకులు,

వివరాలు 2లో..

### పాయింట్ బ్లాంక్‌లో
# గన్ పెట్టి..
## జగన్‌పై టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు సంచలన వ్యాఖ్యలు



- ముంతాజ్ హెూటల్ కు భూముల విషయంలో జగన్ బెదిరించారన్న బీఆర్ నాయుడు
- టీటీడీని వైసీపీ నేతలు దోచుకున్నారని ఆరోపణ
- భూమనను తిరుపతి నుంచి తరిమికొట్టాలని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్: వైసీపీ అధినేత జగన్ పై టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు సంచలన ఆరోపణలు చేశారు. ముంతాజ్ హెూటల్‌కు భూముల విషయంలో అజయ్ అనే వ్యక్తికి జగనే స్వయంగా పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో తుపాకి పెట్టి బెదిరించారని ఆయన ధ్వజమెత్తారు. తిరుపతిలోని పద్మావతి అతిథిగృహంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ముంతాజ్ హెూటల్ వ్యవహారంపై మాట్లాడుతూ, తిరుమల ఏడుకొండలను ఆనుకొని ఉన్న పవిత్రమైన ప్రాంతాన్ని ముంతాజ్ హెూటల్‌కు కేటాయించడం గత వైసీపీ ప్రభుత్వం చేసిన ఘోర తప్పిదమని విమర్శించారు. కోట్లాది రూపాయల టీటీడీ నిధులను వైసీపీ నేతలు మింగేశారని ఆరోపించారు. తమ బోర్డు అధికారంలోకి వచ్చాక అవినీతికి ఏమాత్రం ఆస్కారం లేకుండా పనిచేస్తోందని, టీటీడీ పవిత్రతను కాపాడేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ముంతాజ్ హెూటల్ వివాదాన్ని పరిష్కరించడంలో సీఎం చంద్రబాబు కీలక పాత్ర పోషించారని బీఆర్ నాయుడు తెలిపారు. తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా హెూటల్ నిర్మాణం సరికాదని చంద్రబాబు చెప్పారని, హెూటల్ యాజమాన్యంతో మాట్లాడి వారికి మరోచోట

వివరాలు 2లో..

# పేర్ని నానిపై కేసు నమోదు

- ఏలూరు త్రీటౌన్ పీఎస్ లో కేసు నమోదు
- పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పేర్ని నాని
- పేర్ని నాని వ్యాఖ్యలను ఖండించిన నూజివీడు డీఎస్పీ



పెన్ పవర్ డెస్క్: వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నానిపై ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, దెందులూరు నియోజకవర్గంలో విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడటం వంటి ఘటనలకు సంబంధించి కేసు నమోదు చేశారు. మరోవైపు పోలీసులపై పేర్ని నాని చేసిన వ్యాఖ్యలను నూజివీడు డీఎస్పీ ఖండించారు.

### ఆ ఐఏఎస్ అధికారిణి వేల
# కోట్లు లూటీ చేశారు.. అవినీతిలో అనకొండ
## భూమన సంచలన వ్యాఖ్యలు



- ఆమె రోజుకు రూ. 1.5 లక్షల విలువైన చీర కడతారని ఆరోపణ
- తనపై కక్షగట్టి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపాటు
- టీడీఆర్ బాండ్ల ద్వారా భారీగా దోచుకోవాలని ప్రణాళిక వేశారని ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:వైసీపీ సీనియర్ నేత, టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఓ సీనియర్ ఐఏఎస్ అధికారిణిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆమెను 'అవినీతిలో అనకొండ' అంటూ అభివర్ణించిన ఆయన, టీడీఆర్ బాండ్ల విషయంలో ఎలాంటి విచారణకైనా తాను సిద్ధమని సవాల్ విసిరారు. గత రెండేళ్లుగా తన మనసులో ఉన్న అభిప్రాయాన్ని ఇప్పుడు బయటపెడుతున్నానని భూమన స్పష్టం చేశారు.

వివరాలు 2లో..



## సెలవు

పాఠకులకు, ప్రకటన కర్తలకు, మిత్రులు, శ్రేయోభిలాషులకు వినాయక చవితి శుభాకాంక్షలు. నేడు(బుధవారం) వినాయక చవితి సందర్భంగా పెన్ పవర్ కార్యాలయానికి సెలవు కావున పత్రిక పునర్దర్శనం 29.08.2025

# వ్యాపారుల నుంచి వ్యతిరేకత...
# ఏపీలో బార్ల టెండర్లకు గడువు పెంపు



- కొత్త పాలసీపై వ్యాపారుల నుంచి తీవ్ర వ్యతిరేకత
- రాష్ట్రవ్యాప్తంగా 840 బార్లకు టెండర్ల ప్రక్రియ
- గడువు ముగిసినా ఆశించిన స్థాయిలో రాని దరఖాస్తులు

వివరాలు 2లో..

# కలెక్టరేట్ నిర్మాణానికి నా స్థలం, సగం నిధులు..
## రఘురామకృష్ణరాజు కీలక ప్రకటన!



- పశ్చిమగోదావరి కలెక్టరేట్‌పై ప్రతిష్టంభనకు తెర
- రూ. 70 కోట్ల నిర్మాణ వ్యయంలో సగం తాను భరిస్తానన్న రఘురామ
- శంకుస్థాపనకు రావాలని సీఎం చంద్రబాబును కోరానని వెల్లడి

వివరాలు 2లో..

# కూటమి ప్రభుత్వానికి మానవత్వం లేదు

- దివ్యాంగుల పెన్షన్ల తొలగింపు ఆరోపణలు
- కూటమి సర్కారుపై షర్మిల విమర్శలు
- రీ-వెరిఫికేషన్ పేరుతో అర్హులను వేధిస్తున్నారని ఆరోపణ
- బోగస్ పెన్షన్ల ఏరివేతను స్వాగతిస్తున్నామన్న షర్మిల
- అనర్హుల జాబితాను మరోసారి పరిశీలించాలని ప్రభుత్వానికి డిమాండ్

పెన్ పవర్ డెస్క్:దివ్యాంగుల పెన్షన్ల రీ-వెరిఫికేషన్ పేరుతో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులను వేధిస్తోందని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శిం చారు. అనర్హులను ఏరివేసే నెపంతో, అర్హులైన దివ్యాంగు ల పింఛన్లను సైతం తొలగించి వారి పొట్టకొట్టాలని చూడటం దారుణమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వానికి దివ్యాంగుల పట్ల మానవత్వం లేదంటూ ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా షర్మిల స్పందిస్తూ,

వివరాలు 2లో..




### ఆపరేషన్ సిందూర్ ఇంకా
# ముగియలేదు
## పాకిస్థాన్‌కు సీడీఎస్ పరోక్ష హెచ్చరిక

- ఆపరేషన్ సిందూర్ ఇంకా కొనసాగుతోందని స్పష్టం చేసిన సీడీఎస్
- శాంతిని కోరుకోవడాన్ని బలహీనతగా చూడొద్దని పరోక్ష హెచ్చరిక
- శక్తి లేని శాంతి కేవలం ఒక ఊహ మాత్రమేనని వ్యాఖ్య
- భవిష్యత్ యుద్ధాల స్వరూపాన్ని నిర్దేశించే నాలుగు కీలక అంశాల ప్రస్తావన
- వికసిత భారత్ కోసం ఆత్మనిర్భరత అవసరమని ఉద్ఘాటన
- ఆర్మీ వార్ కాలేజీలో 'రణ్ సంవాద్' సదస్సులో ప్రసంగం

వివరాలు 2లో..



### తెలుగు ప్రజలందరికీ వినాయక చవితి
# శుభాకాంక్షలు



- నేడు వినాయక చవితి
- కుటుంబ ప్రగతికి విఘ్నాలు తొలగాలని చంద్రబాబు ఆకాంక్ష
- లక్ష్య సాధనలో ఎలాంటి ఆటంకాలు రాకూడదని వ్యాఖ్య
- భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్న ప్రజలకు శుభాలు కలగాలి
- గణనాథుడి ఆశీస్సులు అందరిపై ఉండాలని ప్రార్థన

వివరాలు 2లో..



### క్లీన్ ఎనర్జీలో భారత్ సరికొత్త శకం..
# ఇక మనమే గ్లోబల్ హబ్

- అహ్మదాబాద్‌లో హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్‌ల ఉత్పత్తికి శ్రీకారం
- 100 దేశాలకు 'మేడ్ ఇన్ ఇండియా' ఎలక్ట్రిక్ వాహనాల ఎగుమతులు ప్రారంభం
- క్లీన్ ఎనర్జీ, క్లీన్ మొబిలిటీలో భారత్ ప్రపంచ హబ్‌గా మారుతుందన్న ప్రధాని
- భారత్‌లో బ్యాటరీల తయారీ కోసం మూడు జపాన్ కంపెనీల భాగస్వామ్యం
- పెట్టుబడుల కోసం రాష్ట్రాలు ఒకదానితో ఒకటి పోటీ పడాలని మోదీ పిలుపు
- సెమీకండక్టర్లు, కీలక ఖనిజాలపై ఇకపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్న ప్రధాని

పెన్ పవర్ డెస్క్:ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) తయారీ, ఎగుమ తుల రంగంలో భారత్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఇకపై 'మేడ్ ఇన్ ఇండియా' ఈ వీలు ప్రపంచవ్యాప్తంగా 100 దేశాల రోడ్లపై పరుగులు

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# పవన్ పార్టీ ఎదగడానికి ఎంతదూరం?

ఆంధ్రప్రదేశ్ లో జనసేన పార్టీ కేవలం ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2024 ఎన్నికల పరిస్థితులు వేరు. 2029లో జరగబోయే పరిస్థితులు వేరుగా ఉంటాయి. ఎందుకంటే 2024కు ముందు జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎన్నడూ అధికారంలో ఉండలేదు. అదే సమయంలో ఆయనపై జనంలో కూడా బాగా హోప్స్ ఉన్నాయి. పవన్ కల్యాణ్ నీతి మంతుడు. నిజాయితీ పరుడు. రాజకీయాల్లో అవినీతి చేసి డబ్బులు సంపాదించాల్సిన అవసరం లేదు. ఇప్పటికీ అదే నిజం. ఎందుకంటే ఆయన సినిమాల ద్వారానే తన ఆదాయాన్ని సంపాదించుకుంటారు. ఒక్క సినిమా చేస్తే చాలు పార్టీని ఏడాది పాటు నడపటానికి అవసరమైన డబ్బులు సమకూరుతాయి.

**ఇతర నేతలకు భిన్నంగా...**

అందులో పవన్ కల్యాణ్ కు, రాజకీయ నేతలకు మధ్య చాలా తేడా ఉంది. ఏదో చేయాలని మాత్రమే రాజకీయాల్లోకి వచ్చారు. వారసత్వంగానో లేక రాజకీయాల్లో పదవులు సంపాదించుకుని సొమ్ములు మూటగట్టుకుందామన్న ధ్యాస కూడా లేదు. తాను ఫీలయితే సొంత డబ్బులు అయినా ఇచ్చి ఆ సమస్యకు పరిష్కారం చూపడంలో ఉప ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా ముందుంటారు. అటువంటి పవన్ కల్యాణ్ కూటమి ప్రభుత్వంలో కీలకంగా మారారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా, పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా జోడీ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో పరుగులు పెట్టిస్తుందని ఆశించారు. అయితే అనేక కారణాలు ఆయన కాళ్లకు బ్రేకులు వేశాయనే చెప్పాలి.

**పథ్నాలుగు నెలల నుంచి...**

ఎందుకంటే గత పథ్నాలుగు నెలల నుంచి పవన్ కల్యాణ్ తనకు బాధ్యత అప్పటించిన మంత్రిత్వ శాఖలో విజయం సాధించినప్పటికీ, ఉప ముఖ్యమంత్రిగా మాత్రం ఆశించిన రీతిలో పనితీరు లేదన్నది ప్రజాభిప్రాయంగా వినిపిస్తుంది. ఏ విషయంలోనూ కూటమి ప్రభుత్వంలో తీసుకుంటున్న నిర్ణయాలు తప్పని చెప్పే పనికి దూరంగా ఉంటుండటంతో కొంత పవన్ ఇమేజ్ రాజకీయంగా డ్యామేజీ అయిందనే చెప్పాలి. అయితే పవన్ కల్యాణ్ అంటే నేటికీ అభిమానమున్న జిల్లాలు కొన్ని మాత్రమే మిగిలి ఉన్నాయి. అక్కడ కూడా 2024 ఎన్నికల కంటే ముందున్న పరిస్థితులకు భిన్నంగా మారాయి. అయినా రెండు జిల్లాల్లోనే నేటికీ పవన్ కల్యాణ్ పార్టీ బలంగా ఉండటంతో మిగిలిన జిల్లాల్లో బలహీనంగా ఇప్పటికీ కొనసాగుతుండటంతో రానున్న ఎన్నికల నాటికి పవన్ రంగంలోకి దిగి మార్చకపోతే మరింత దిగజారే అవకాశాలున్నాయన్నది సుస్పష్టం.

# కలెక్టరేట్ నిర్మాణానికి నా స్థలం, సగం నిధులు..

నూతన పశ్చిమగోదావరి జిల్లా సమీకృత కలెక్టరేట్ నిర్మాణానికి సంబంధించి నెలకొన్న ప్రతిష్టంభనకు తెరదించుతూ, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కీలక ప్రకటన చేశారు. కలెక్టరేట్ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని తానే సమకూర్చడంతో పాటు, నిర్మాణ ఖర్చులో సగం భరిస్తానని ఆయన ముందుకొచ్చారు. ఈరోజు జిల్లాలో పర్యటించిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.

కొత్త జిల్లా ఏర్పడిన నాటి నుంచి కలెక్టరేట్ కార్యాలయం అద్దె భవనంలోనే కొనసాగుతోందని రఘురామ గుర్తుచేశారు. గతంలో మార్కెట్ యార్డులో స్థలం కేటాయించినా, ఆ ప్రతిపాదన ముందుకు సాగలేదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో, కలెక్టరేట్ నిర్మాణ బాధ్యతలో తాను పాలుపంచుకుంటున్నట్లు ప్రకటించారు. కలెక్టరేట్ భవనాన్ని సుమారు రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించాలని భావిస్తున్నట్లు రఘురామ తెలిపారు. దీనికి మొత్తం రూ.70 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేయగా, అందులో రూ.35 కోట్లు ప్రభుత్వం మంజూరు చేస్తుందని, మిగిలిన రూ.35 కోట్లను తానే సమకూరుస్తానని హామీ ఇచ్చారు. “స్థలం నేను ఇచ్చాను, సగం డబ్బు కూడా ఇస్తానని మాట ఇచ్చాను” అని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై కొందరు సంకుచిత స్వభావంతో మాట్లాడుతున్నారని, మండలి ఛైర్మన్ దీనిని ఇరిగేషన్ భూమి అన్నారని రఘురామ ప్రస్తావించారు. తాను భీమవరం, ఉండి అని వేరుగా చూడటం లేదని, జిల్లా అంతా ఒకే యూనిట్‌గా భావిస్తున్నానని స్పష్టం చేశారు. పెద అమిరం గ్రామాన్ని భీమవరం మున్సిపాలిటీలో కలపడానికి కూడా సిద్ధంగా ఉన్నామని ఆయన అన్నారు. ఈ బృహత్ కార్యక్రమానికి త్వరలోనే శంకుస్థాపన చేసేందుకు రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబును తాను స్వయంగా కోరినట్లు రఘురామకృష్ణరాజు వెల్లడించారు.

# వ్యాపారుల నుంచి వ్యతిరేకత... ఏపీలో బార్ల టెండర్లకు గడువు పెంపు

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన కొత్త బార్ పాలసీకి మొదటి అడుగులోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రవ్యాప్తంగా 840 బార్లకు టెండర్లు ఆహ్వానించగా, మద్యం వ్యాపారుల నుంచి ఊహించని విధంగా నిరసన వ్యక్తమవడంతో దరఖాస్తులు దాదాపుగా రాలేదు. దీంతో కంగుతిన్న ఎక్సైజ్ శాఖ అధికారులు, టెండర్ల గడువును పొడిగించక తప్పలేదు.

వాస్తవానికి, బార్ అండ్ రెస్టారెంట్ల టెండర్లకు దరఖాస్తు చేసుకునేందుకు ఈరోజు సాయంత్రంతో గడువు ముగిసింది. అయితే, కొత్త పాలసీలో నిబంధనలు ఆచరణ సాధ్యంగా లేవని, లోపభూయిష్టంగా ఉన్నాయని మద్యం వ్యాపారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విధానాన్ని వ్యతిరేకిస్తూ దరఖాస్తులు చేయకూడదని వారు ముందుగానే నిర్ణయించుకున్నారు. పాలసీలో కీలక మార్పులు చేసే వరకు తాము టెండర్ల ప్రక్రియలో పాల్గొనబోమని స్పష్టం చేస్తున్నారు. వ్యాపారుల నుంచి స్పందన కరవవడంతో, ప్రభుత్వం వెంటనే దిద్దుబాటు చర్యలకు దిగింది. దరఖాస్తుల స్వీకరణకు తుది గడువును ఈ నెల 29వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు పొడిగిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. అయితే, గడువు పొడిగించినంత మాత్రాన తాము దరఖాస్తులు చేసేది లేదని, ముందుగా పాలసీని సవరించాల్సిందేనని వ్యాపారులు పట్టుబడుతున్నారు. దీంతో ఈ వ్యవహారం ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది.

# తెలుగు ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు

నేడు వినాయక చవితి (ఆగస్టు 27) పర్వదినాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తెలుగు ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ శుభ సందర్భంగా చంద్రబాబు తన సందేశాన్ని వెలువరిస్తూ, ప్రజలు నిర్దేశించుకున్న లక్ష్యాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా చేరుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, ఆ గణనాథుడు అందరినీ అనుగ్రహించాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వాడవాడలా మండపాలను ఏర్పాటు చేసి, భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య గణేశుడిని పూజిస్తున్న భక్తులకు సకల శుభాలు కలగాలని ఆ వినాయకుడిని ప్రార్థిస్తున్నట్లు చంద్రబాబు వివరించారు. ఈ పండుగ ప్రతి ఇంటా సుఖసంతోషాలను నింపాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆ ఐఏఎస్ అధికారిణి వేల కోట్లు లూటీ చేశారు.. అవినీతిలో అనకొండ

- మొదటి పేజీ తరువాయి

తిరుపతిలో భూమన మాట్లాడుతూ.. గతంలో పనిచేసిన సదరు ఐఏఎస్ అధికారిణికి డబ్బు సంపాదించాలనే ధ్యాస తప్ప నైతిక విలువలు లేవని ఆరోపించారు. ఆమె శాఖకు సంబంధించిన మంత్రులను సైతం ఆమె కనీసం లెక్కచేయలేదని, కిందిస్థాయి అధికారుల పట్ల ‘తాటకి’లా వ్యవహరించారని తీవ్ర విమర్శలు చేశారు. తిరుపతిలో మాస్టర్ ప్లాన్ రోడ్లు వేస్తున్న సమయంలో, టీడీఆర్ బాండ్ల ద్వారా భారీగా దోచుకోవాలని ఆమె ప్రణాళిక వేశారని, అయితే తాము దానిని అడ్డుకున్నామని భూమన వివరించారు. ఈ విషయం తట్టుకోలేకే, సదరు అధికారిణి నెల్లూరు జిల్లా నేతలకు తప్పుడు సమాచారం అందించి, తాను రూ.2,000 కోట్లు దోచుకున్నానంటూ అబద్ధపు ప్రచారం చేయించారని భూమన ఆరోపించారు. తాను ఒక్క రూపాయి అవినీతికి పాల్పడినట్టు నిరూపించినా ఎలాంటి శిక్షకైనా సిద్ధమని ఆయన సవాల్ విసిరారు. “ఆమె 35 ఏళ్ల సర్వీసులో ఎక్కడ పనిచేసినా వందల, వేల కోట్లు లూటీ చేశారు. ఆమె అవినీతి గురించి సుప్రీంకోర్టుకు కూడా తెలుసు” అని భూమన వ్యాఖ్యానించారు.

సదరు ఐఏఎస్ అధికారిణి రోజూ ధరించే చీర ఖరీదు రూ.1.5 లక్షలు ఉంటుందని, వేల రూపాయల విలువ చేసే 11 విగ్గులు ఆమె వద్ద ఉన్నాయని భూమన వ్యక్తిగత ఆరోపణలు చేశారు. నీతిగా, నిజాయతీగా ఉన్న తనపై కక్షగట్టి, కుట్రపూరితంగా అసత్య ప్రచారం చేయిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాము 21 మాస్టర్ ప్లాన్ రోడ్లు వేసి తిరుపతిని అభివృద్ధి చేశామని ఈ సందర్భంగా కరుణాకర్ రెడ్డి గుర్తుచేశారు. వైసీపీ హయాంలో పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన శ్రీలక్ష్మిని లక్ష్యంగా చేసుకుని భూమన ఈ వ్యాఖ్యలు చేసినట్టు భావిస్తున్నారు.

# కూటమి ప్రభుత్వానికి మానవత్వం లేదు

- మొదటి పేజీ తరువాయి

“బోగస్ పెన్షన్లను గుర్తించి, దొంగ సర్టిఫికెట్లతో లబ్ధి పొందుతున్న వారిని ఏరివేయడాన్ని కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తుంది. అలాంటి సర్టిఫికెట్లు ఇచ్చిన వైద్యులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాల్సిందే. కానీ, ఆ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలి. రీ-వెరిఫికేషన్ పేరుతో ఏళ్ల తరబడి పెన్షన్ మీద ఆధారపడి జీవిస్తున్న నిజమైన వికలాంగులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదు” అని అన్నారు. ప్రభుత్వం నోటీసులు జారీ చేసిన 1.20 లక్షల మందిలో అత్యధికులు అర్హులే ఉన్నారని తమకు సమాచారం అందిందని షర్మిల పేర్కొన్నారు. ప్రభుత్వం రూపొందించిన అనర్హుల జాబితాను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలని ఆమె డిమాండ్ చేశారు. “వికలాంగుల జీవితాలతో రాజకీయాలు చేయడం తగదు. ప్రభుత్వం వారి పట్ల మానవత్వంతో వ్యవహరించాలి. అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది” అని ఆమె హితవు పలికారు.

ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణమే జోక్యం చేసుకోవాలని షర్మిల కోరారు. అర్హులుగా తేలిన వారి పెన్షన్లను వెంటనే పునరుద్ధరించి, వారికి న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ తరఫున ఆమె డిమాండ్ చేశారు.

# క్లీన్ ఎనర్జీలో భారత్ సరికొత్త శకం.. ఇక మనమే గ్లోబల్ హబ్

- మొదటి పేజీ తరువాయి

పెట్టను న్నాయి. అహ్మదాబాద్‌లోని హన్సల్‌పూర్‌లో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ ఎగుమతులను జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఇదే వేదికపై హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్‌ల స్థానిక ఉత్పత్తిని కూడా ఆయన ప్రారంభించడం విశేషం.

ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, క్లీన్ ఎనర్జీ, క్లీన్ మొబిలిటీ రంగాల్లో భారత్ ప్రపంచ హబ్‌గా అవతరించబోతోందని ధీమా వ్యక్తం చేశారు. “గతంలో ఈవీలకు అత్యంత కీలకమైన బ్యాటరీలను మనం పూర్తిగా దిగుమతి చేసుకునేవాళ్లం. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారుతోంది. మూడు ప్రముఖ జపాన్ కంపెనీలు కలిసి భారత్‌లోనే బ్యాటరీ సెల్స్, ఎలక్ట్రోడ్‌లను తయారు చేస్తున్నాయి. ఇది మన దేశ హైబ్రిడ్ వాహనాల మార్కెట్‌కు కొత్త ఊపునిస్తుంది” అని ఆయన వివరించారు. భారత్-జపాన్ మధ్య బంధం కేవలం వ్యాపారానికే పరిమితం కాదని, చారిత్రక, సాంస్కృతిక మూలాలున్నాయని ప్రధాని గుర్తుచేశారు. “సుజుకి వంటి జపాన్ కంపెనీలు ఇక్కడ కార్లను తయారు చేసి, తిరిగి జపాన్‌కే ఎగుమతి చేస్తున్నాయి. ఇదే మన రెండు దేశాల సంబంధాల బలానికి నిదర్శనం. మారుతి సుజుకితో మొదలైన ఈ ప్రయాణం ఇప్పుడు బుల్లెట్ ట్రైన్ వేగంతో దూసుకెళుతోంది” అని మోదీ వ్యాఖ్యానించారు.

గత దశాబ్దంలో తమ ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక సంస్కరణలు, ‘మేక్ ఇన్ ఇండియా’ వంటి కార్యక్రమాల ఫలాలు ఇప్పుడు కనిపిస్తున్నాయని ప్రధాని మోదీ తెలిపారు. “వ్యాపార అనుకూల వాతావరణం, లాజిస్టిక్స్ పార్కులు, పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటుతో పెట్టుబడులకు అనువైన మార్గాలను సృష్టించాం. ఫలితంగా పదేళ్లలో ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ 500 శాతం పెరిగింది” అని అన్నారు.

భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తూ, “మేం ఇక్కడితో ఆగిపోం. ఇకపై సెమీకండక్టర్ల తయారీపై దృష్టి పెడతాం. త్వరలో ఆరు ప్లాంట్లు సిద్ధం కాబోతున్నాయి.

అదేవిధంగా కీలక ఖనిజాల కోసం ‘నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్’ను ప్రారంభించాం” అని ప్రధాని వెల్లడించారు. అభివృద్ధి అనుకూల విధానాల రూపకల్పనలో రాష్ట్రాలు ఒకదానితో ఒకటి పోటీ పడాలని, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని చూరగొనాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# రొటీన్ సమావేశాలు వద్దు.. ప్రజల కోసం పనిచేయండి

- మొదటి పేజీ తరువాయి

ఆర్థిక సంస్థలు కీలక పాత్ర పోషించాలన్నారు. సంపద సృష్టితో పాటు పేద, ధనిక వర్గాల మధ్య అంతరాలను తగ్గించేందుకు కృషి చేయాలని సూచించారు. 2047 నాటికి భారత్‌ను బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టాలన్న లక్ష్యంలో భాగంగా బ్యాంకులు సమష్టిగా పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయం, ఎంఎస్ఎంఈ, గ్రామీణ బ్యాంకింగ్ సేవలపై సమీక్ష నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌కు గానూ రూ.1,80,540 కోట్ల రుణ లక్ష్యం కాగా, జూన్ నాటికి రూ.94,666 కోట్లు మంజూరు చేసినట్లు బ్యాంకర్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కౌలు రైతులకు రూ.985 కోట్లు, ఎంఎస్ఎంఈ రంగానికి రూ.49,831 కోట్లు, స్వయం సహాయక సంఘాలకు రూ.5,937 కోట్ల రుణాలు అందించినట్లు వివరించారు. వీటితో పాటు విద్యా రంగానికి రూ.252 కోట్లు, గృహ నిర్మాణ రంగానికి రూ.1,146 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

# ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు

“ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు, అది ఇప్పటికీ కొనసాగుతోంది” అని త్రివిధ దళాధిపతి (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్ శాంతినే కోరుకుంటుందని, అయితే దానిని బలహీనతగా పొరబడకూడదని ఆయన స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్‌లోని మౌలో ఆర్మీ వార్ కాలేజీలో మంగళవారం ప్రారంభమైన ‘రణ్ సంవాద్’ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందనగా చేపట్టిన ఆపరేషన్ పేరును ప్రస్తావిస్తూ పాకిస్థాన్‌కు పరోక్షంగా గట్టి హెచ్చరికలు పంపారు.

ఈ సందర్భంగా జనరల్ చౌహాన్ మాట్లాడుతూ, “భారత్ ఎల్లప్పుడూ శాంతి వైపే నిలబడుతుంది. మేము శాంతిని ప్రేమించే వాళ్ళం. అయితే దానిని ఆసరాగా చేసుకుని మమ్మల్ని దెబ్బకొట్టాలని చూస్తే మాత్రం ఊరుకునే ప్రసక్తి లేదు” అని అన్నారు. గతంలో జరిగిన యుద్ధాలకు, ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాలకు వ్యత్యాసం ఉందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో యుద్ధాల స్వరూపం పూర్తిగా మారిపోతుందని ఆయన విశ్లేషించారు. దీనిని ప్రభావితం చేసే నాలుగు ముఖ్యమైన అంశాలను ఆయన వివరించారు. “రాజకీయ లక్ష్యాలను సాధించడానికి చిన్నపాటి యుద్ధాలను ఉపయోగించే ధోరణి దేశాల మధ్య పెరిగింది. యుద్ధం, శాంతి మధ్య తేడా చెరిగిపోతోంది. ఒకప్పుడు యుద్ధాలు భూభాగం కోసం జరిగితే, ఇప్పుడు ప్రజల ప్రాణాలకు ఎక్కువ విలువ ఇస్తున్నారు. గతంలో శత్రువులకు కలిగించిన నష్టం ఆధారంగా విజయాన్ని అంచనా వేసేవారు. కానీ ఇప్పుడు, ఆపరేషన్ల వేగం, కచ్చితత్వంతో కూడిన దాడులు విజయాన్ని నిర్ధారిస్తున్నాయి” అని ఆయన తెలిపారు. ‘వికసిత భారత్’ లక్ష్యాన్ని చేరుకోవాలంటే దేశం ‘సశస్త్ర’, ‘సురక్షిత్’, ‘ఆత్మనిర్భర్’గా ఉండాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. కేవలం సాంకేతికతలోనే కాకుండా, ఆలోచనలు, ఆచరణలో కూడా స్వయం సమృద్ధి సాధించాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వాయు, జల, భూతల మార్గాల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి త్రివిధ దళాల మధ్య మరింత సమన్వయం అవసరమని ఆయన పేర్కొన్న విషయం తెలిసిందే. రెండు రోజుల పాటు జరిగే ఈ ‘రణ్ సంవాద్’ సదస్సు ముగింపు కార్యక్రమంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగించనున్నారు.

# పాయింట్ బ్లాంక్‌లో గన్ పెట్టి..

- మొదటి పేజీ తరువాయి

25 ఎకరాల స్థలం తీసుకునేలా ఒప్పించారని వివరించారు. టీటీడీ భూములను ప్రైవేటు సంస్థలకు కట్టబెడుతున్నారని కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన ఖండించారు. ఈ అంశంపై సీబీఐ విచారణ జరిపించాలని వైసీపీ నేతలు డిమాండ్ చేయడాన్ని ఆయన హాస్యాస్పదంగా అభివర్ణించారు. డబ్బు వెదజల్లి అందరినీ కొనడం వారికి అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. ఇదే క్రమంలో, మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిపై కూడా నాయుడు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తిరుపతిలో నివసించే అర్హత భూమనకు లేదని, ఆయన్ను తిరుపతి నుంచి తరిమికొట్టాలని అన్నారు.

## జిల్లా ప్రజలకు "వినాయక చవితి" శుభాకాంక్షలు



**నంద్యాల పెన్ పవర్ , ఆగస్టు 26 :** సర్వ విఘ్నాలను తొలగించి.. సకల శుభాలను ప్రసాదించే ఆ మహా గణపతి... జిల్లా ప్రజలందరికీ పరిపూర్ణమైన ఆయుఃరారోగ్యాలను, అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని... ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులు జిల్లాపై ఎల్లవేళలా ఉండాలని.. జిల్లా మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్ధన రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జేసి విష్ణు చరణ్ ఆకాంక్షించారు. ఈ మేరకు మంగళవారం వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 27న బుధవారం "వినాయక చవితి" పర్వదినం సందర్భంగా జిల్లా మంత్రులు, జిల్లా కలెక్టర్, జేసిలు జిల్లా ప్రజలకు హృదయ పూర్వకంగా వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వినాయక చవితి పర్వదినం ప్రతి ఒక్కరికి అత్యంత ఇష్టమైన భక్తి పూర్వకమైన పండుగ. ఆ మహాగణాధిపతి ప్రతి ఒక్కరి విఘ్నాలను తొలగించి సంతోషాన్ని, ఆనందాన్ని అందించాలని.. జిల్లా ప్రజలంతా భక్తి శ్రద్ధలతో ఆనందంగా పండుగ జరుపుకోవాలన్నారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రతీ ఇల్లు సంక్షేమ, సౌభాగ్యాలతో శోభాయమానంగా వెలుగొందాలన్నారు. పల్లెసీమలు పశుసంపద, వ్యవసాయ, ఉద్యాన పంటలతో సుభిక్షంగా కళకళలాడాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ సుపరిపాలనలో ప్రజలకు సంక్షేమ ఫలాలు సంతృప్తస్థాయిలో అందాలని, అందరి భాగస్వామ్యంతో అభివృద్ధిలో నంద్యాల జిల్లా ముందడుగు వేయాలని ఈ సందర్భంగా వారు అభిలషించారు.

# పెన్ పవర్
## వై.ఎస్.ఆర్. కడప
## అన్నమయ్య జిల్లా



## ముఖ్యమంత్రి జిల్లా పర్యటన కోసం స్థల పరిశీలన



**అనంతపురం, పెన్ పవర్ ఆగస్టు 26 :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సెప్టెంబర్ 6వ తేదీన అనంతపురం జిల్లా పర్యటనకు రానున్న నేపథ్యంలో రాష్ట్ర ఆర్థిక&ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ స్థల పరిశీలన చేశారు. మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనంతపురం జిల్లా పర్యటన సందర్భంగా రాప్తాడు మండలంలోని గంగులకుంట గ్రామం వద్ద మరియు రాప్తాడులో ఆటోనగర్ వద్ద ఉన్న స్థలాలను మంత్రి పయ్యావుల కేశవ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు, డీఎస్పీ వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే ఉపయోగించాలి

### – పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి








**అనంతపురం, పెన్ పవర్ ఆగస్టు 26 :** మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే ఉపయోగించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ పిలుపునిచ్చారు. మంగళవారం అనంతపురం నగరంలోని రాంనగర్ లో ఉన్న ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపిపిసిబి) ప్రాంతీయ కార్యాలయం సమీపంలో మట్టి వినాయకుడిని పూజిద్దాం – పర్యావరణాన్ని రక్షిద్దాం అంటూ నిర్వహించిన పర్యావరణ అనుకూల వినాయక చవితి అవగాహన కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ఉచితంగా మట్టి వినాయకులను జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రజలు మట్టి గణేష్ విగ్రహాలను మాత్రమే ఉపయోగించాలని మరియు ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను నివారించాలని కోరారు. ఎందుకంటే అవి నీటి వనరులను కలుషితం చేస్తాయని, పర్యావరణ పరిరక్షణలో వ్యక్తుల పాత్రను కూడా వివరించారు. ప్రజలకు అవగాహన కల్పించడానికి మట్టి గణేష్ విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయడంలో ఏపిపిసిబి చొరవను అభినందించారు. ఏపిపిసిబి పర్యావరణ ఇంజనీర్ బివై.ముని ప్రసాద్ మాట్లాడుతూ రామ్ నగర్ లోని ఏపిపిసిబి ప్రాంతీయ కార్యాలయం సమీపంలో స్టాల్ ఏర్పాటు చేసిందని మరియు ప్రజలకు అవగాహన కల్పించడానికి ఏపిపిసిబి సుమారు 3,000 మట్టి గణేష్ విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరికుమార్, ఏపిపిసిబి అధికారులు పాల్గొన్నారు.

## మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామికి ఘన స్వాగతం



**అనంతపురం పెన్ పవర్ ఆగస్టు 26 :** రాష్ట్ర సామాజిక సంక్షేమ, వికలాంగుల మరియు సీనియర్ పౌర సంక్షేమ, సచివాలయం శాఖ మంత్రి డాక్టర్ డోల బాల వీరాంజనేయ స్వామికి ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర సామాజిక సంక్షేమ, వికలాంగుల మరియు సీనియర్ పౌర సంక్షేమ, సచివాలయం శాఖ మంత్రి డాక్టర్ డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి ఒకరోజు పర్యటన నిమిత్తం అనంతపురం జిల్లాకు విచ్చేశారు. మంగళవారం ఉదయం అనంతపురం ఆర్.అండ్.బి అతిథి గృహంలో మంత్రి డాక్టర్ డోల బాల వీరాంజనేయ స్వామి గారిని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేసి ఘన స్వాగతం పలికారు.

## పర్యావరణహితమైన మట్టి గణపతి విగ్రహాలను పూజించండి




**చిత్తూరు పెన్ పవర్ ఆగస్టు 26 :** నగర ప్రజలు పర్యావరణ హితమైన మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని నగర మేయర్ ఎస్ అముద పిలుపునిచ్చారు. మంగళవారం నగర పాలక కార్యాలయంలో ప్రజారోగ్య విభాగం పర్యావరణ కార్యదర్శులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో మేయర్ ఎస్ అముద, కమిషనర్ పి నరసింహ ప్రసాద్, ఎంహెచ్వో డా. పి.లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించే వినాయక చవితి పర్వదినాన్ని పర్యావరణహితంగా మట్టితో చేసిన వినాయక విగ్రహాలను వినియోగించాలన్నారు. కమిషనర్ పి నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ.. నగర ప్రజలు వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, మట్టి విగ్రహాలను పూజకు వినియోగించాలని కోరారు. వినాయక విగ్రహాల నిమజ్జనానికి కట్టమంచి చెరువు వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఉద్యోగులకు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ చేసిన కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్



**తిరుపతి, పెన్ పవర్ ఆగస్టు 26 :** నేటి మంగళవారం మధ్యాహ్నం చంద్రగిరి మండలం తొండవాడ లింగాలగుంట ఎస్టీ కాలనీలో ని భూదేవమ్మ, నారాయణమ్మ, గంగాదేవి ఇతరత్రా కాలనీవాసులకు జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్ తిరుపతి ఆర్డిఓ రామ్మోహన్ తో కలిసి స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కాలనీ వాసులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో చౌక దుకాణాల ద్వారా పారదర్శకంగా నిత్యావసర సరుకులు పొందుట కోసం స్మార్ట్ రైస్ కార్డులు ఎంతగానో ఉపయోగపడతాయనితెలిపారు. స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తూ అక్కడున్న కాలనీవాసులకు పెన్షన్, రేషను సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు గ్రామ సచివాలయ సిబ్బంది, వీఆర్వో, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### గాంధీనగర్ ఉన్నత పాఠశాలను
## ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే మాధవి రెడ్డి



**కడప పెన్ పవర్ ఆగస్టు 26 :** కడప నగరంలోని గాంధీనగర్ మున్సిపల్ హై స్కూల్‌ను ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి, కమిషనర్ మనోజ్ రెడ్డి పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తో కలిసి అక్కడ నెలకొని ఉన్న సమస్యలను గురించి దాదాపు ఒక గంట పాఠశాల మొత్తము ఆవరణ అంతయు పరిశీలించారు. అక్కడ నెలకొని ఉన్న బాత్రూంలో సమస్యలు, పాత బాత్రూములను సరిచేసి వినియోగం లోకి తేవలసిందిగా తక్షణ ఏర్పాటు కావాలని ఎమ్మెల్యే మాధవి రెడ్డి అధికారులకు ఆదేశించారు. పాఠశాల మైదానంలో నీరు నిల్వకుండా తగు చర్యలు తీసుకునే విధంగా, ప్రహరీ గోడను ఫినిషింగ్ డైమండ్ వైర్ తో ఎనిమిది అడుగుల ఎత్తు వరకు ఏర్పాటు చేసే విధంగా, అలాగే పాఠశాల ఆవరణంలోనే నీటిని ఇంకిపోయే విధంగా ఏర్పాటు చేసి, నీటిని కాలువలోకి కలిపే విధంగా ఏర్పాటు చేయవలసిందిగా ఇంజనీరును ఆదేశించారు. ప్రాథమిక పరిశుభ్రత లో భాగంగా తక్షణమే పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయవలసిందిగా, ప్రధానోపాధ్యాయురాలు ప్రాథమిక సమస్యలైన తెలుగు అధ్యాపక వాలంటీర్లను, సోషల్ స్టడీస్ వాలంటీర్ను, ఒకరు పీఈటి మాస్టర్ తక్షణ ఏర్పాటు చేయవలసినదిగా ఎమ్మెల్యే మాధవి రెడ్డి, కమిషనర్‌తో మాట్లాడారు. ఏదిఏమైనా అభివృద్ధిలో భాగంగా కడప మున్సిపల్ హై స్కూల్ గాంధీనగర్ పాఠశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ప్రధానోపాధ్యాయురాలు అభివృద్ధిలో కొంతవరకైనా అభివృద్ధి చెందుతుంది అని ఆశాభావం వ్యక్తం చేశారు. ఫిర్యాదు మేరకు స్కూల్‌లో తాగునీటి కోసం ఆర్ఓ సౌకర్యం, వర్షం పడినప్పుడు నీరు నిల్వ అవ్వడం, బాత్రూమ్ సమస్యలు తలెత్తడం వంటి అంశాలను ప్రాంగణంలో స్వయంగా పరిశీలించి, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాధవి, మనోజ్ రెడ్డి కడప కమిషనర్, ఎంపీడీఓ, సంబంధిత అధికారులతో చర్చించి, సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, శుభ్రత, మౌలిక వసతులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన పనులను వెంటనే చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, స్థానిక ప్రజలు కూడా పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కరించడానికి తాను కట్టుబడి ఉంటానని ఎమ్మెల్యే మాధవి గారు భరోసా ఇచ్చారు. కార్పొరేషన్ సిబ్బంది, ఇంజనీరింగ్ విభాగం, శానిటేషన్ విభాగం వారు, తదితరులు పాల్గొన్నారు.

## కలమళ్ళలో ఆలయాలను పరిశీలించిన కలెక్టర్



**ఎర్రగుంట్ల పెన్ పవర్ ఆగస్టు 26 :** ఎర్రగుంట్ల మండలం కలమల్ల గ్రామంలో పురాతన ఆలయంగా ప్రసిద్ధి గాంచిన శ్రీ చెన్నకేశవస్వామి ఆలయం శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, జిల్లా ఎస్పీ ఈజి అశోక్ కుమార్ లతో కలిసి పరిశీలించారు. పురాతన కాలం నుండి ఒక సామాజిక వర్గంకు చెందిన గ్రామస్తులు.. పూజా కైంకర్యాలు నిర్వహిస్తూ వచ్చిన చెన్నకేశవ అలయానికి అంబందించిన ఆలయ మాన్యాలను... మరొక సామాజిక వర్గానికి చెందిన వారు.. అక్రమంగా వినియోగిస్తున్నారని జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదులు అందడంతో జిల్లా కలెక్టర్ గ్రామాన్ని, సంబందిత ఆలయాలను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఊరు వెలుపల కోనేరు వద్ద 15 ఏళ్ల క్రితం పాత పురాతన అలయం పేరుతో రిజిస్ట్రేషన్ చేయించి ఆ ఆలయానికి సంబంధించిన మాన్యాలను అక్రమంగా వాడుకుంటూ నితన ఆలయానికి చెందినవిగా అనుభవిస్తున్నారని పురాతన ఆలయానికి సంబంధించిన వర్గం వారు జిల్లా కలెక్టర్ కు వివరించారు. కాగా.. శ్రీ సిద్దేశ్వర స్వామి ప్రధాన ఆలయం ఇదేనంటూ.. ఇక్కడి స్వామివారి పుష్కరిణి వద్దే ఆలయాన్ని నూతనంగా నిర్మించామని.. అసలైన పురాతన ఆలయం ఇదేనంటూ ఆలయ మాన్యాలపై హక్కు తమదేనంటూ మరో వర్గానికి చెందిన గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. అయితే.. ఇరువురి అభ్యర్థనలను విన్న జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలు పూర్వపరాలను, రెవెన్యూ రికార్డులను పరిశీలించి న్యాయం చేస్తామని తెలిపారు. రెవెన్యూ అధికారులు పూర్వపు రికార్డులను పునఃపరిశీలించి న్యాయబద్ధమైన నిర్ణయాన్ని ఇస్తామన్నారు. కార్యక్రమంలో ముందుగా చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలోని తొలి తెలుగు శిలా శాసనాలను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ మల్లికార్జున, మండల తహశీల్దార్ శోభన్ బాబు, రెవిన్యూ, దేవాదాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరూ మట్టి గణపతిని పూజిద్దాం : మంత్రి పయ్యావుల కేశవ్



**అనంతపురం, పెన్ పవర్ ఆగస్టు 26 :** రాష్ట్ర ఆర్థిక&ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ రాష్ట్ర, జిల్లా ప్రజలకు "వినాయక చవితి" శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంవత్సరం వినాయక చవితి పండుగ ఆగస్టు 27న వచ్చిందని, ఈ రోజున వినాయకుడిని ఘనంగా పూజించడం, ఊరేగించడం, నిమజ్జనం చేయడం చేస్తుంటారన్నారు. గణేష్ నవ రాత్రులు అంటే 9 రోజులు వినాయకుడిని పూజించి 10వ రోజు నిమజ్జనం చేస్తారన్నారు. వినాయకుడిని భక్తితో పూజిస్తే తలపెట్టిన ఏ కార్యంలో అయినా ఆటంకాలు, ఇబ్బందులు లేకుండా విజయం సాధిస్తారని నమ్మకం అని, అందుకే వినాయక చవితి పండుగ రోజు విఘ్నహర్త అయిన వినాయకుడి పూజ ఘనంగా చేస్తారన్నారు. ప్రతి ఏడాది భాద్రపద మాసంలో వినాయక చవితి పండుగను నిర్వహించుకుంటున్నామన్నారు. గణనాథుని ఆరాధన సమాజంలో ఐకమత్యం, సౌభ్రాతృత్వం, సద్భావనలను పెంపొందిస్తుందని, గణపతి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆరోగ్యం, ఐశ్వర్యంతో నిండాలని కోరుకున్నారు. ప్రతి ఒక్కరూ మట్టి గణపతిని పూజిద్దామని, పర్యావరణాన్ని కాపాడే యజ్ఞంలో భాగమవుదామన్నారు. రంగురంగుల విగ్రహాలతో పర్యావరణానికి జరిగే నష్టాన్ని తగ్గిద్దామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వ సుపరిపాలనలో ప్రజలకు సంక్షేమ ఫలాలు సంతృప్తస్థాయిలో అందాలని, జిల్లా ప్రజలకు పరిపూర్ణమైన ఆయురారోగ్యాలు సిద్ధించాలని ఆకాంక్షించారు.

## మట్టి వినాయకుని పూజించి...
# పర్యావరణాన్ని కాపాడుకుందాం...

– ప్రిన్సిపాల్ డా.పి.నారాయణ రెడ్డి



**మైదుకూరు పెన్ పవర్ ఆగస్టు 26 :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మైదుకూరు ప్రిన్సిపల్ డాక్టర్ పి. నారాయణ రెడ్డి గారి అధ్యక్షతన కళాశాల ఎన్ఎస్ఎస్ మరియు వృక్ష శాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా "మట్టి వినాయకుని పూజిద్దాం" అనే అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ పి. నారాయణ రెడ్డి స్వాగత ఉపన్యాసంలో మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో బాలగంగాధర్ తిలక్ మరియు అనేకమంది జాతీయ నాయకులు గణేశోత్సవ ఉద్యమాన్ని ప్రజల్లో చైతన్యం నింపడానికి వినియోగించారని గుర్తుచేశారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయకుని పూజించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆంగ్ల అధ్యాపకులు రాధా రామ్ మాట్లాడుతూ వినాయక చవితి వైశిష్టతను, సాంప్రదాయ పద్ధతులను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని వివరించారు. వృక్ష శాస్త్ర విభాగ అధ్యాపకులు డాక్టర్ పి.వి. కృష్ణారెడ్డి మాట్లాడుతూ వినాయక చవితి పూజలో వినియోగించే 21 రకాల పత్రాల ఔషధ విలువలు మరియు వాటి ప్రత్యేకతలను వివరించారు. తదనంతరం ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సుభాన్ సాహెబ్, ఆంగ్ల అధ్యాపకులు రాధా రామ్, తెలుగు అధ్యాపకురాలు అనురాధ లక్ష్మి, ఆర్ఆర్సి కోఆర్డినేటర్ అయ్యవారు రెడ్డి తదితర అధ్యాపక బృందం విద్యార్థులకు మరియు సిబ్బందికి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని వృక్ష శాస్త్ర అధ్యాపకులు మరియు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.వి.కృష్ణారెడ్డి సమన్వయం చేశారు.

## అసంఘటిత కార్మికులకు అవగాహన సదస్సు




**అనంతపురం పెన్ పవర్ ఆగస్టు 26 :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గారైన ఇ. భీమారావు సూచనల మేరకు, ఈరోజు " అసంఘటిత కార్మికులు " అని అంశం మీద జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి గారైన శ్రీ యన్. రాజశేఖర్ గారి అధ్యక్షతన, జిల్లా న్యాయ సేవధికారి సంస్థ నందు అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో వక్తలు మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం కింద పనిచేస్తున్న శ్రామికులక వున్నా హక్కులు భాద్యతలు, చట్ట లపట్ల అవగాహన, ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎం సుజాత గారు మండల్ కోఆర్డినేటర్ శ్రీదేవి గారు చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకటేశ్వరి గారు ప్రభుత్వ వైద్యశాల ఆర్ఎంఓ హేమలత గారు గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ కవిత గారు మహిళా పిఎస్ ఎస్ఐ గోవిందరాజులు గారు మహేష్ అనూష అద్వకేట్ మరియు కోర్టు సిబ్బంది పాల్గొని ఈ అవగాహన సదస్సును విజయవంతం చేశారు.

## ఆలయాలు.. గ్రామస్తుల బంధాలను బలపరిచేలా ఉండాలి..!!

జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



**కడప, పెన్ పవర్ ఆగస్టు 26 :** గ్రామాల్లో నిర్మించే ఆలయాలు గ్రామస్తుల మధ్య బంధాలను బలపరిచేలా ఉండాలి కానీ, గ్రామస్తుల మధ్య విభేదాలను పెంచేలా ఉండకూడదని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి హితవు పలికారు. ఎర్రగుంట్ల మండలంలోని పోట్లదృత్తి గ్రామంలో శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయ ఆలయానికి సంబంధించి ప్రహరీ గోడ నిర్మాణ విషయంలో ఇరువర్గాల మధ్య తలెత్తిన అభ్యంతరాలు, విభేదాల పరిష్కారం కోసం మంగళవారం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ తో కలిసి గ్రామాన్ని, ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఒక గ్రామానికి బడి, గుడి అనేవి.. ఆ గ్రామ అభివృద్ధికి కావాల్సిన విద్యాబుద్ధులు, గ్రామస్థుల్లో చక్కటి నడవడిక, శాంతియుతమైన ప్రశాంత వాతావరణాన్ని కల్పిస్తామన్నారు. విద్యతో పాటు వినాయన్ని, నైపుణ్యాన్ని, ఉద్యోగ ఉపాధి అవకాశాలను బడి నేర్పిస్తే.. ఆలయాలు గ్రామంలో శాంతియుత వాతావరణాన్ని, సంస్కృతి సంప్రదాయాలను, పండుగలు, ఉత్సవాలు, గ్రామస్థుల మధ్య బంధాలను, స్నేహ భావాన్ని పెంపొందిస్తాయన్నారు. కాగా.. పోట్లదుర్తి గ్రామంలో దేవాదాయ శాఖకు సంబంధించి 3.5 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఉన్న శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయాన్ని ఆలయ పెద్దగా కొన్నేళ్లుగా అభివృద్ధి చేపడుతున్నారని, అదే క్రమంలో ఆలయానికి చుట్టూ ప్రహరీ గోడ నిర్మించే ప్రయత్నంలో.. గ్రామంలో ఒక వర్గానికి చెందిన వారు.. ప్రహరీ గోడ నిర్మాణాన్ని అడ్డుకోవడం జరుగుగుతోందని, విచారించి న్యాయం చేయాలని.. ఆలయ పెద్దగా వ్యవహరిస్తున్న సురేష్ నాయుడు తరుపు ప్రతినిధులు తమకు అర్జీలు సమర్పించడం జరిగిందన్నారు. ఆ మేరకు పెద్దమ్మ తల్లి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టే ప్రాంతం హద్దులు, ఆలయం చుట్టూ వున్న నివాసాలు, రోడ్డు తదితర ప్రాంతాలను పరిశీలించామన్నారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా ప్రహరీ నిర్మాణం చేపట్టాలనే వారి నుండి, కాంపౌండ్ వాల్ నిర్మాణంపై అభ్యంతరం.తెలిపే వారి నుండి.. పూర్తి వివరాలను సేకరించాలని.. అభ్యర్థనాలను పరిశీలించి.. సమస్యకు న్యాయపరమైన పరిష్కారం చూపుతామన్నారు. గ్రామానికి మంచి జరగడం కోసం, గ్రామ అభివృద్ధి కోసం.. చేపట్టే ఏ పనినైనా ప్రోత్సహించి సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్, ఎస్పీలు పెద్దమ్మతల్లి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ఆలయ ప్రాశస్త్యాన్ని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, ఎండోమెంట్. అసిస్టెంట్ కమీషనర్ మల్లికార్జున, పోలీసు శాఖ, రెవెన్యూ, దేవాదాయ శాఖల అధికారులు, స్థానిక నాయకులు సురేష్ నాయుడు, రాజేష్ నాయుడు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# "రాజంపేట మరియు బద్వేలు సబ్ జైలుల విజిట్"






**రాజంపేట పెన్ పవర్ ఆగస్టు 26 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా, గౌరవ డాక్టర్ సి.యామిని, చైర్మన్-కం-జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారి సూచనల మేరకు గౌరవ సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఎస్.బాబా ఫక్రుద్దీన్ వారు రాజంపేట మరియు బద్వేల్ సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను విజిట్ చేయడం జరిగినది. రిజిస్టర్లను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ సబ్ జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌ల ప్రాధాన్యతను తెలియజేశారు, జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమును వివరించారు. ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి అన్నారు, జైళ్లలో బాల నేరస్తులు ఉంటే గుర్తించడం వారికి తగు న్యాయ సహాయం అందించడం మొదలగు అంశాలను వివరించారు. అనంతరం జైలు పరిసరాలను, టాయిలెట్లను, వంట గదిని, వసతి గదులను, పరిశీలించి తగు సూచనలను సలహాలను ఇవ్వడం జరిగినది. లీగల్ సర్వీసెస్ హెల్ప్




లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఏవైనా సమస్యలుంటే రాజంపేట మండల న్యాయ సేవా సమితిని, బద్వేలు మండల న్యాయ సేవా సమితిని మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించవచ్చును అన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట మరియు బద్వేల్ సబ్ జైలుల సూపరిండెంట్ లు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు మరియు ఖైదీలు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలపై అవగాహన సదస్సు



**కడప పెన్ పవర్ ఆగస్టు 26 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా, గౌరవ డాక్టర్ సి.యామిని, అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారి సూచనల మేరకు గౌరవ సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఎస్.బాబా ఫక్రుద్దీన్ వారు బద్వేల్ నగరం జంగాల కాలనీ నందు గిరిజన ప్రజలలో బాల్య వివాహాలు - చిన్న వయసు లోనే గర్భధారణ మొదలగు అంశాలపై అవగాహన ప్రచార కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ నల్సా (గిరిజన హక్కుల రక్షణ మరియు అమలు) పథకం 2015, నల్సా (సంవాద్-అట్టడుగు బలహీన ఆదివాసులు మరియు డినోటిఫైడ్/ సంచార తెగలకు న్యాయం పొందే అవకాశాన్ని బలోపేతం చేయడం,) పథకం 2025, నల్సా (ఆశ అవగాహన మద్దతు సహాయం మరియు చర్య) బాల్యవివాహాలను నిర్మూలించడానికి ప్రామాణిక ఆపరేటింగ్ విధానం 2025, గిరిజన ప్రజలలో బాల్య వివాహాలు - చిన్న వయసులోనే గర్భధారణ అంశాలపై అవగాహన కలిగించడం జరిగినది, పిల్లలు బాగా చదివించి ఉన్నత స్థానాలకు చేర్చాలి, విద్య హక్కు చట్టం, ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలి. భారత రాజ్యాంగం, ఆర్టికల్ 21, 1098 హెల్ప్ లైన్, మహిళా హెల్ప్ లైన్ నంబర్ 181, న్యాయ సహాయం కోసం హెల్ప్‌లైన్-15100, చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, దివ్యాంగజన్ హెల్ప్ లైన్ నెంబర్ 14456 మొదలు అంశాలను తెలియజేశారు. ఏమైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప మరియు మండల న్యాయ సేవా సమితి బద్వేలు వారిని సంప్రదించవచ్చును అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎన్.శ్రీనివాసులు మరియు జి.చక్రధర్ మరియు గిరిజనులు పాల్గొన్నారు.

# మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని రక్షిద్దాం

– మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేసిన కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి





**వైయస్సార్ కడప పెన్ పవర్, ఆగస్టు 26 :** ఈనెల 27న వినాయక చవితి పండుగను పురస్కరించుకొని పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ప్రజలను కోరారు. మంగళవారం స్థానిక స్టేట్ గెస్ట్ హౌస్ కోటిరెడ్డి సర్కిల్ వద్ద పర్యావరణ కాలుష్య నియంత్రమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించి ఆయన చేతుల మీదుగా నగర ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ మట్టి విగ్రహాలతో వాయు, నీటి కాలుష్యాన్ని పూర్తిగా నివారించవచ్చన్నారు.కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి గణపతులను పంపిణీ చేస్తూ పర్యావరణంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పీవోపీతో తయారు చేసిన గణపతుల వల్ల నీటి, వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. నీటిలో జీవించే ప్రాణుల ఉనికికి ప్రమాదం ఏర్పడుతుందని తెలిపారు. మట్టి వినాయకులను పూజించడం వల్ల పర్యావరణ పరిరక్షణతోపాటు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవచ్చని వివరించారు. కలెక్టర్ ప్రజలకు ముందస్తు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.నగరంలో దాదాపు 3 వేలకు పైగా విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ కాలుష్య నియంత్ర మండలి అధికారులు, నగర ప్రజలు,తదితరులు పాల్గొన్నారు

## జిల్లా ప్రజలకు "వినాయక చవితి" శుభాకాంక్షలు

– జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



**వైయస్సార్ కడప పెన్ పవర్ ఆగస్టు 26 :** రాష్ట్ర ప్రభుత్వ సుపరిపాలనలో ప్రజలకు సంక్షేమ ఫలాలు సంతృప్త స్థాయిలో అందాలని, జిల్లా ప్రజలకు పరిపూర్ణమైన ఆయురారోగ్యాలు సిద్ధించాలని కోరుకుంటూ.. ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ప్రజాప్రతినిధులు ఆకాంక్షించారు. ఈ నెల "27న "వినాయక చవితి" పర్వదినాన్ని పురస్కరించుకుని... వారు మంగళవారం ఒక ప్రకటనలో జిల్లా ప్రజలకు తమ హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగలు, వేడుకలు.. మన సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతిబింబాలు అని.. ఈ వినాయక చవితి పర్వదినం.. ప్రతి ఒక్కరికీ విఘ్నాలను తొలగించి సంతోషాన్ని, ఆనందాన్ని అందించాలని ఆయన ఆకాంక్షించారు.

**జిల్లా సుభిక్షంగా ఉండాలి :** వినాయక చవితి సంధర్భంగా.. ఆ మహాగణపతి ఆశీస్సులతో.. ప్రతీ ఇల్లు సంక్షేమ, సౌభాగ్యాలతో శోభాయమానంగా వెలుగొందాలన్నారు. పల్లెసీమలు.. పశుసంపద, వ్యవసాయ, ఉద్యాన పంటలతో సుభిక్షంగా కలకళలాడాలని ఆకాంక్షిస్తూ..కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తో పాటు ఎస్.పి. అశోక్ కుమార్, జేసి అదితి సింగ్, డి ఆర్ వో విశ్వేశ్వర నాయుడు,ఎంపీలు, జిల్లాలోని ఎం.ఎల్.సీలు, ఎమ్మెల్యేలు ఆ ప్రకటనలో జిల్లా ప్రజలందరికీ "వినాయక చవితి" శుభాకాంక్షలు తెలియజేశారు. ఆ గణపతి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, అందరి భాగస్వామ్యంతో అభివృద్ధిలో జిల్లాను ముందంజలో నిలపాలని ఈ సందర్భంగా వారు అభిలషించారు. జాగ్రత్తలు పాటిస్తూ.. ఆనందోత్సాహాలతో గణపతి ఉత్సవాలను నిర్వహించుకోవాలని వారు ఆ ప్రకటనలో కోరారు.

## రాష్ట్ర, జిల్లా ప్రజలకు "వినాయక చవితి" శుభాకాంక్షలు

– ప్రతి ఒక్కరూ మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడే యజ్ఞంలో భాగమవుదాం : మంత్రి అనగానే సత్యప్రసాద్



**తిరుపతి, ఆగస్టు 26 :** రెవెన్యూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రివర్యులు మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ రాష్ట్ర, జిల్లా ప్రజలకు "వినాయక చవితి" శుభాకాంక్షలు తెలిపారు. గణనాథుని ఆరాధన సమాజంలో ఐకమత్యం, సౌభ్రాతృత్వం, సద్భావనలను పెంపొందిస్తుందని, గణపతి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖ సంతోషాలు, ఆరోగ్యం, ఐశ్వర్యంతో నిండాలని కోరుకున్నారు. ఆ గణపతి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, అందరి భాగస్వామ్యంతో అభివృద్ధిలో జిల్లాను ముందంజలో నిలపాలని ఈ సందర్భంగా అభిలషించారు. తగు జాగ్రత్తలు పాటిస్తూ.. ఆనందోత్సాహాలతో గణపతి ఉత్సవాలను నిర్వహించుకోవాలన్నారు.

## రైతులకు ఎరువులు సక్రమంగా అందజేయాలి



**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 26 :** రైతులకు ఎరువులు పురుగుమందులను ఎటువంటి ఆటంకం లేకుండా అందజేయాలని మండల తహసిల్దార్ ఎంపీ కృష్ణారెడ్డి చెప్పారు. మంగళవారం నాడు పొదిలిలో ఎరువుల దుకాణాలపై ఎన్ఫోర్స్మెంట్ టీం దాడులు జరిపింది. ఈ సందర్భంగా తహసిల్దార్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు ఎరువుల షాపుల యజమానులు తమ వ్యాపారాలు సాగించుకోవాలన్నారు. కాకుండా తమ స్వలాభం కోసం ఎరువులు, పురుగుమందుల కృత్రిమ కొరత సృష్టిస్తే, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని, కొనుగోలు సమయంలో రైతులకు తప్పక రసీదులు ఇవ్వాలని ఆయన సూచించారు. అలాగే ఎరువుల దుకాణాల యజమానులు తమ షాపుల ముందు స్టాక్ బోర్డులు విధిగా ఏర్పాటు చేయాలని తహసిల్దార్ కృష్ణారెడ్డి సూచించారు. ప్రభుత్వ నియమ నిబంధనలను వ్యతిరేకించే ఎరువుల షాపుల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవడంలో వెనుకాడబోమని తహసిల్దార్ కృష్ణారెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎన్ఫోర్స్మెంట్ టీం పలు ఎరువుల దుకాణాల్ని పరిశీలించారు.

# ఏపీఐఐసీ మెగా ఇండస్ట్రియల్ హబ్ పరిశీలించిన ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ





**కడప, పెన్ పవర్ ఆగస్టు 26 :** జిల్లాలో ప్రధాన ఉపాధి వనరుల ఖిల్లాగా కొప్పర్తి ఏపీఐఐసీ మెగా ఇండస్ట్రియల్ హబ్ వెలుగొందుతోందని, ఉద్యోగ ఉపాధి అవకాశాలకు కొరత లేదని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్నారు. మంగళవారం కొప్పర్తి లోని దాదాపు 600 ఎకరాల్లో ఏర్పాటైన మెగా ఇండస్ట్రియల్ హబ్ లో ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ ను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ తోకలిసి పరిశీలించారు. సెప్టెంబర్ 2న రాష్ట్ర విద్యాశాఖ, ఐటి శాఖామంత్రి జిల్లాలో పర్యటించనున్న సందర్భంగా.. కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్కులో నూతనంగా నిర్మించిన ఎగ్జిక్యూటివ్ గెస్ట్ హౌస్ ను అలాగే.. నూతనంగా ఏర్పాటైన "టెక్నో డోమ్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్", రెడీమేడ్ సూట్స్ తయారు చేసే "టెక్సానా ఇండియా ప్రయివేటు లిమిటెడ్" పరిశ్రమల్లో ప్రొడక్షన్ ను మంత్రిచే ప్రారంభోత్సవం చేయించే యోచనలో జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. అందులో భాగంగా.. అధునాతన సదుపాయాలతో నిర్మితమైన ఎగ్జిక్యూటివ్ గెస్ట్ హౌస్ తోపాటు ఆయా పరిశ్రమల యూనిట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. మంత్రిచే ప్రారంభోత్సవం చేయడానికి తగిన ఏర్పాట్లపై ఎమ్మెల్యేతో కలిసి సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు.

అంతేకాకుండా అక్కడ అవసరమైన భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎస్పీతో చర్చించారు. ఈ సందర్భంగా మెగా ఇండస్ట్రియల్ పార్కులో నిర్వహణలో ఉన్న ఎల్ఈడి మానిటర్ల ఉత్పత్తి కంపెనీ "టెక్నో డోమ్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్", రెడీమేడ్ సూట్స్ తయారు చేసే "టెక్సానా ఇండియా ప్రయివేటు లిమిటెడ్" పరిశ్రమలను అక్కడి ఉత్పత్తులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అక్కడ తయారువుతున్న ఎల్ఈడి మానిటర్లు, రెడీమేడ్ సూట్ ల నాణ్యతతో పాటు అక్కడ సిబ్బంది, సదుపాయాలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సలహాలు, సూచనలు ఇస్తూ.. ఇక్కడ



ఉత్పత్తి, ఉపాధి అవకాశాలు, సదుపాయలకు సంబందించి ఎలాంటి అవసరాలు వున్నా తమకు తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మంచి సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఆ దిశగా కొప్పర్తి పారిశ్రామిక వాడను.. రాష్ట్రంలోనే మోడల్ ఇండస్ట్రియల్ పార్కుగా తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం కృషిచేస్తోందన్నారు. అందులో భాగంగంగానే.. కొప్పర్తి పారిశ్రామిక వాడలో జిల్లాకే తలమానికంగా "ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ (ఈఎంసీ)" క్లస్టర్‌లో పరిశ్రమలు రూపు దిద్దుకుంటున్నాయన్నారు. ఎన్నో ప్రతిష్ఠాత్మకమైన కంపెనీలు కొప్పర్తి పారిశ్రామిక వాడలో రూపుదిద్దుకుంటున్నాయని.. దీంతో జిల్లా యువతకు భారీగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు, కాంట్రాక్టర్లకు, పెట్టుబడిదారులకు మంచి అవకాశాలు పెరగనున్నాయని.. భవిష్యత్తులో జిల్లా పారిశ్రామికంగా మరింత అభివృద్ధిలోకి రానుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, ఏపి ఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాస మూర్తి, ఇండస్ట్రీస్ జీఎం చాంద్ బాషా, సికే దిన్నె తహసీల్దార్ నాగేశ్వరరావు, సంబందిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు వచ్చేలా కార్యక్రమాలు : కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి

**అనంతపురం, పెన్ పవర్ ఆగస్టు 26 :** ఈనెల 28వ తేదీన నిర్వహించే డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల ధృవీకరణ కోసం పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం అనంతపురం నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్, యూరియా అందుబాటు, స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు, స్వర్ణాంధ్ర 2047, పంచాయతీ సెక్టార్, తదితర అంశాలపై డిఆర్ఓ, వివిధ శాఖల జిల్లా అధికారులు, జడ్పి సిఈఓ, డిపిఓ, ఆర్డీఓలు, తహసీల్దార్లు, డిఎల్డిఓలు, డిఎల్పీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఈఓఆర్డీలు, తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 28వ తేదీన అనంతపురం నగరంలోని ఆలమూరు రోడ్ లో ఉన్న బాలాజీ బీఈడీ కాలేజ్ (ఎంబిఏ) కళాశాలలో2047 నిర్వహించే డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల ధృవీకరణ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందుకోసం సీటింగ్ ఏర్పాట్లు, పోలీసు వారు సెక్యూరిటీ ఏర్పాట్లు చేయాలని, ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల ధృవీకరణ కార్యక్రమానికి హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడు నోడల్ అధికారిగా ఉంటారని, విద్యాశాఖ అధికారులతో సమన్వయం చేసుకొని ఈ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు.

**యూరియా కొరత రాకూడదు :** జిల్లాలో ఎక్కడా కూడా యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిణి, మార్క్ఫెడ్ డిఎం ని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. యూరియా కృత్రిమ కొరత నివారించేందుకు అగ్రికల్చర్, కోఆపరేటివ్, మార్క్ ఫెడ్, పోలీస్, రెవెన్యూ అధికారులతో జాయింట్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయడం జరిగిందని, కమిటీ ప్రభావవంతంగా పనిచేయాలన్నారు. ప్రైవేట్ వారు ఎమ్మార్పీ కన్నా ఎక్కువకు యూరియా అమ్మితే నోటీసులు ఇవ్వాలని, ఎవరు ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరకు అమ్మితే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఏ మండలంలో యూరియా సమస్య ఉంటే ఆ మండలానికి యూరియా అందించేలా చూడాలన్నారు. ఎక్కడా యూరియా కొరత లేదు అనేది అందరికీ స్పష్టంగా తెలియజేయాలన్నారు.



**జిల్లాకు అధిక సంఖ్యలో స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు వచ్చేలా స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టాలి :** జిల్లాకు అధిక సంఖ్యలో స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు వచ్చేలా స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టాలి అని డిపిఓ, ఇతర అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ ఏడాది జనవరి నుంచి స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమము మొదలైందని, గత ఏడు నెలల నుంచి స్వచ్ఛ ఆంధ్ర క్యాంపైన్ ను ప్రతి నెల చేశామని, వచ్చే అక్టోబర్ 2వ తేదీ నాటికి స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు ఇవ్వడం జరుగుతుందని, ఇందులో అనంతపురం జిల్లా అధిక సంఖ్యలో అవార్డులు గెలుచుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. స్వచ్ఛ మున్సిపాలిటీలు, స్వచ్ఛ గ్రామ పంచాయతీ, స్వచ్ఛ స్కూల్స్, స్వచ్ఛ అంగన్వాడీలు, స్వచ్ఛ ఆస్పత్రులు, స్వచ్ఛ గవర్నమెంట్ ఆఫీసర్స్, స్వచ్ఛ బస్టాండ్స్, స్వచ్ఛ రైతు బజార్, స్వచ్ఛ హాస్టల్స్, స్వచ్ఛ ఇండస్ట్రీస్, స్వచ్ఛ ఎంఎస్ఎంఈలు, స్వచ్ఛత వారియర్స్, తదితర అన్ని రకాల అవార్డులు అందిపుచ్చునేలా ఆయా శాఖల అధికారులు దృష్టి సారించాలన్నారు. ఈ విషయమై డివిజన్, మండల స్థాయి టీమ్లను ఏర్పాటు చేసి అవార్డులు వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. స్వర్ణాంధ్ర 2047కు సంబంధించి 21 శాఖల పరిధిలో మండల ఇండికేటర్స్ కింద శాఖల వారిగా కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ లో అచీవ్మెంట్ ప్రోగ్రెస్ రిపోర్ట్ ను నెలవారీగా, మూడు నెలలకు, ఆరు నెలలకు, ఏడాదికి సంబంధించిన అప్లోడ్ చేయాలన్నారు. అలాగే 2025- 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 31 శాఖలకు సంబంధించి జిల్లా ఇండికేటర్స్ లో అచీవ్మెంట్ ప్రోగ్రెస్ రిపోర్ట్ వెంటనే అప్లోడ్ చేయాలని, ఇందుకు సంబంధించి గంటకొకసారి రిపోర్ట్ ఇవ్వాలని సూచించారు. గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాలు (జి.ఎస్.డబ్ల్యు.ఎస్) అంశాలలో భాగంగా కౌశలం సర్వేకి సంబంధించి కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా రోజువారిగా లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. తల్లికి వందనం సంబంధించి పెండింగ్ ఉన్న ఎన్పీసీఐ లింక్ ను యాక్టివేట్ చేయాలని, మదర్, చైల్డ్ ఈకేవైసీ పెండింగ్ ను, గ్రీవెన్స్ పెండింగ్ ను వెంటనే పూర్తి చేయాలన్నారు. మన మిత్ర క్యాంపెయిన్ లో హౌస్ హోల్డ్ పెండింగ్, సిటిజన్స్ ఈ కేవైసీ రిపోర్ట్, ఆధార్ సీడింగ్ ఫర్ వాహన్ డేటా, సచివాలయ ఉద్యోగుల బయోమెట్రిక్ అటెండెన్స్, ఏపీ సేవా సర్వీసెస్ చార్జెస్ పెండింగ్ వెంటనే పూర్తి కావాలని ఆదేశించారు. స్వామిత్వ ఫేజ్ - 2లో జిల్లాలోని 31 మండలాల్లో 280 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ చేపట్టడం, వెక్టరైజేషన్ పూర్తి, పార్సెల్స్ / పిపి మ్యాప్స్, అగ్రికల్చర్ రీసర్వే పూర్తి, జీకే బౌండరీ డెమోన్స్ట్రేషన్, తదితర అంశాల్లో రీసర్వేతో పాటు ఎంపీడీవోలు, తహసీల్దార్లు స్వామిత్వను కూడా పూర్తి చేయాలని ఆదేశించారు. పిఆర్ వన్ యాప్ లో రోజు చెత్త సేకరణ ప్రతి గ్రామ పంచాయతీలో చేపట్టి వివరాలను నమోదు చేయాలని, క్లోరినేషన్ ప్రక్రియ, ట్యాంకులు శుభ్రం చేయడం రోజు చేయాలన్నారు. ఐగాట్ కర్మయోగి స్టేటస్ రిపోర్ట్ కి సంబంధించి అనంతపురం రూరల్, బుక్కరాయసముద్రం, కంబదూరు, కనేకల్లు, యాడికి, తదితర మండలాలు వెనుకబడి ఉన్నాయని, వెంటనే పురోగతి తీసుకురావాలన్నారు. ఐవిఆర్ఎస్ కాల్స్ కి సంబంధించి నెలవారీ నివేదికలో 50 శాతం కన్నా పాజిటివ్ తక్కువ ఉన్న పంచాయతీ సెక్రటరీలపై చర్యలు తీసుకోవాలని, ఎంపీడీవోలు వెనుకబడిన పంచాయతీలలో 48 గంటల్లోగా తనిఖీలు చేసి సానుకూల ప్రజా అవగాహనలో పురోగతి తీసుకురావాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఆయా శాఖల జిల్లా అధికారులు, డిపిఓ, జడ్పి సిఈఓ, డిఈఓ, సిపిఓ, సమగ్ర శిక్ష ఏపిసి, ఆర్డీఓలు, డిఎల్డిఓలు, తహసీల్దార్లు, డిఎల్పిఓలు, ఎంపీడీవోలు, ఈఓఆర్డీలు, తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవ మండపాల ఏర్పాట్లలో ఉత్సవ కమిటీలు



**సి.ఎస్.పురం, పెన్ పవర్ ఆగస్టు 26 :** వినాయక చవితి పండుగ ను పురస్కరించుకొని మండల కేంద్రం మరియు పలు గ్రామాలలో గణేష్ ఉత్సవ కమిటీలు మండపాలు ఏర్పాట్లు చేస్తున్నారు భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణం కల్పించేందుకు ఆకర్షనీయమైన అలంకరణలు, విద్యుత్తు వెలుగులతో మండపాలను తీర్చిదిద్దుతున్నారు భక్తులు సౌకర్యంగా దర్శనం చేసుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు పానీయాలు సౌండ్ సిస్టమ్స్ సాంస్కృతిక కార్యక్రమాల షెడ్యూలను సిద్ధం చేస్తున్నారు వినాయకుని విగ్రహాలు ప్రతిష్టించేందుకు ఏర్పాట్లు చురుకుగా కొనసాగుతున్నాయి వినాయక చవితి వేడుకలు భక్తి ఆనందాలతో అంగరంగ వైభవంగా జరుగునున్నాయని ఉత్సాహం ప్రజలలో కనిపిస్తుంది ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఏడాదిలో మహా ప్రధానమైన పర్వదినం, మహాగణపతి పార్వతీ తనయుడుగా ఆవిర్భవించిన రోజు విఘనాలకు సకల దేవ గణాలకు అధిపతి అన్ని శుభకార్యాలకు తొలి పూజ అందుకొనే వినాయకుడు భాద్రపద మాస చతుర్థి నాడు జన్మించడంతో వినాయక చవితి వేడుకలను శాస్త్రోక్తంగా గణపతి ప్రతిమను బంగారంతో గానీ, వెండితోగానీ, రాగితోగానీ, మట్టితోగానీ, ఏమీ లేకపోతే తమలపాకు మీద పసుపుతో వినాయకుడిని చేసి అర్చించాలని దూర్వాలు, బిల్వాలు(మారేడు) గణపతికి ప్రీతికరాలు. కనుక వాటితో అర్చించాలి. అవికాక శాస్త్రంలో చెప్పబడిన 21పత్రాలతో పూజించాలి ఇవన్నీ ఓషధీయ విలువలున్న పత్రాలు. ఇంటిల్లిపాదీ, ఊరూ వాడా పూజించుకునే పర్వమిది. కొన్నిచోట్ల నవరాత్రులు చేసే సంప్రదాయం ఉంది. ప్రతి ఇంటా యథావిధి గణపతిని పత్రాలతో పూజించి ఆయనకు ప్రీతికరంగా ఉండ్రాళ్ళు, కుడుములు, వెలగ, అరటి, కొబ్బరి మొదలైన ఫలాలు నివేదించాలి.పాలవెల్లి అలంకరణమే ఒక చక్కని అనుభూతి. మొక్కజొన్న పొత్తులు, వెలగ, కమల మొదలైన పళ్ళు, కాయలు పాలవెల్లి నుండి వ్రేలాడదీసి, మామిడి తోరణాలు, చిన్న అరటి మొక్కలు మొదలైన వాటితో అలంకరించి సర్వసస్యాధిదేవునిగా సర్వ లోకేశ్వరునిగా వినాయకుని పూజిస్తారు. ఈస్వామి ఆరాధన వల్ల అన్ని శుభాలు లభిస్తాయి. వెంటనే దయ చూపించే సులభ ప్రసన్నుడు విఘ్నరాజు అనివినాయక చవితి నాడు మండపాలు చక్కగా, పర్యావరణ హితంగా, కలసికట్టుగా, ఉదయం ,సాయంత్రం పూజలు, దేముని పాటలు, చక్కటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి వినాయక మండపాలు ఏర్పాట్లు చేసుకొని, ప్రజలు విఘ్నేశ్వరుని ప్రార్థించడం వలన విఘ్నాలు తొలగి, ఆటంకాలు లేకుండా సకల కార్యసిద్ధి కలగాలని ఐక్యమత్యంతో కలిసిమెలిసి పండుగ జరుపుకోవాలని పలువురు ప్రజలు కోరారు.

## విజేతలైన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ క్రీడలలో సత్తా చాటాలి

### - జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్




**తిరుపతి , పెన్ పవర్ ఆగస్టు 26 :** జోనల్ పోటీల్లో విజేతలైన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొని, విజేతలుగా నిలిచి తమ సత్తా చాటాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు.మంగళవారంమధ్యాహ్నం స్థానిక ఎస్.వి.ఆర్ట్స్ కళాశాల లోని,శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్,ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన "ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి అమరావతి ఛాంపియన్షిప్ కప్ " ముగింపు వేడుకలలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. అతి తక్కువ సమయంలో ఛాలెంజ్ గా తీసుకుని తిరుపతి పట్టణంలో ఈనెల 24 తేదీ నుండి 26 తేదీ వరకు మూడు రోజుల పాటు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను దిగ్విజయంగా నిర్వహించామన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలు ఒలంపిక్, కామన్వెల్త్ నేషనల్ గేమ్స్ లలో పాల్గొని దేశం గర్వించేలా పథకాలు సాధించాలని క్రీడాకారులకు సూచించారు. అందుకు తగ్గ విధంగా క్రీడాకారులు శ్రమించి తగు ప్రణాళికలు రచించుకొని కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడా పాలసీని ప్రవేశపెట్టి క్రీడాకారులనుప్రోత్సహిస్తోందన్నారు. ఆర్చరీ,అథ్లెటిక్స్,బ్యాట్మెంటన్ బాస్కెట్బాల్, బాక్సింగ్, హాకీ, కబడ్డీ ,కోకో, వాలీబాల్,వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ఇక్కడ నిర్వహించడం జరిగిందన్నారు .ఈ పోటీలలో రాష్ట్రంలోని అన్ని జోన్ల నుండి మంచి టాలెంట్ ఉన్న క్రీడాకారులు,క్రీడాకారిణులు ఎంతో ఉత్సాహంగా పాల్గొనడం జరిగిందన్నారు.వారందరికీ కూడా స్థానిక ఎస్వీ మరియు మహిళా యూనివర్సిటీలలో వసతిసౌకర్యాన్ని కల్పించడం జరిగిందన్నారు. ఈ మూడు రోజులపాటు అధికారులందరూ క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రవాణా, భోజన వసతి సదుపాయాలను కల్పించడం జరిగిందన్నారు. ఏదైనా చిన్నపాటి లోటుపాట్లు ఉంటే సహృదయంతో మన్నించాలన్నారు. ఈనెల 24వ తేదీన రాష్ట్ర క్రీడా రవాణా శాఖ మంత్రి ,శాప్ ఛైర్మన్ లు అట్టహాసంగా ఈ పోటీలను ప్రారంభించడం జరిగిందన్నారు. వారందరి సహకారంతో ఈ పోటీలను విజయవంతంగా నిర్వహించామన్నారు. ఇందుకు సహకరించిన రాష్ట్ర,జిల్లా స్థాయి క్రీడా ప్రాధికార సంస్థకు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఈ పోటీలు విజయవంతం కావడానికి,క్రీడా సంస్థ అధికారులు, కోచ్ లు, పీడీలు, పీఈటీ లు,ఇతర సహాయక సిబ్బంది, వివిధ అసోసియేషన్లు ఎంతో శ్రమించారన్నారు. ఇందుకు వారందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. తిరుపతిలో మరింత పెద్ద స్థాయిలో క్రీడలు నిర్వహించుకునే అవకాశం ఈ పోటీల ద్వారా నిరూపితమైందన్నారు .ఈ సందర్భంగా పై 10 క్రీడలలో గెలుపొందిన వివిధ జోన్లకు చెందిన క్రీడాకారులు, క్రీడాకారిణులకు జిల్లా కలెక్టర్ సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య మాట్లాడుతూ ..వివిధ జోన్ల నుండి అమరావతి చాంపియన్షిప్




పోటీలలో పాల్గొనేందుకు తిరుపతికి విచ్చేసి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులందరికీ అభినందనలు తెలియజేశారు. ఈ క్రీడాకారులందరూ జాతీయ క్రీడలలో సైతం పాల్గొని తమ సత్తా చాటాలని ఆమె ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర శాప్ డైరెక్టర్ మరియు క్రీడాకారిణి రజిని మాట్లాడుతూ ..రాష్ట్రస్థాయిలో తొలిసారిగా అతి తక్కువ సమయంలో ఇలాంటి టోర్నమెంట్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు జిల్లా, జోన్ ,రాష్ట్రస్థాయిల నుండి ఎంతోమంది క్రీడాకారులు పాల్గొనడం ,అందుకు తిరుపతి వేదిక కావడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహకాలను అందిస్తోందన్నారు. ఉద్యోగాల్లో మూడు శాతం రిజర్వేషన్లను కూడా వారికి కల్పిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ ను క్రీడాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్దేశ్యమన్నారు. యువ క్రీడాకారులకు మంచి అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని, దాన్ని అందిపుచ్చుకుని మరింతగా రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ సంతోష్,శాప్ అధికారి కోటేశ్వరరావు ,తిరుపతి జిల్లా డిఎస్డివో శశిధర్,జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్



**తిరుపతి పెన్ పవర్ ఆగస్టు 26 :** వినాయక చవితి సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఆది దేవుడైన వినాయకుడు సర్వ విఘ్నాలను తొలగించి జిల్లా ప్రజలకు మంచి చేకూర్చాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉత్సవాలు నిర్వహించుకోవాలని, మట్టి గణపతిని పూజించాలని కోరారు.

## యూరియా కొరతపై నంద్యాల కలెక్టర్‌తో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సమీక్ష




**నంద్యాల పెన్ పవర్ ఆగస్టు 26 :** నంద్యాల జిల్లాలో యూరియా కొరత అంశంపై జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియాతో సమీక్షించిన రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి.
నంద్యాల పట్టణంలో ఆర్&బీ గెస్ట్ హౌస్ లో నేడు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్ రాజకుమారి గణియా. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయానికి అవసరమైన మేరకు యూరియాను రైతులకు అందుబాటులో ఉంచాలని కలెక్టర్‌కు సూచించిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి. రైతులకు యూరియా సమస్య తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశం. రైతులు యూరియా సరఫరా అంశంలో ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా రైతులందరికీ సరిపడా యూరియా అందజేయడం జరుగుతుందని భరోసా వ్యక్తం చేసిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి. రైతులు తమ పంటకు సరిపడా యూరియా మాత్రమే తీసుకోవాలని, యూరియా కొరత ఏర్పడుతుందనే ఆందోళనతో అధిక మోతాదులో యూరియా కొనుగోలు చేయొద్దని సూచించిన మంత్రి. ప్రభుత్వం ఏ సీజన్ కు సంబంధించి ఆ సీజన్లో రైతులకు సరిపడా యూరియా అందజేయడం జరుగుతుందని తెలిపిన మంత్రి. యూరియా కొనుగోలు విషయంలో బ్లాక్ మార్కెట్‌కు ఆస్కారం లేకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించిన మంత్రి.

## మట్టి వినాయక విగ్రహాల పంపిణీ




**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 26 :** వినాయక చవితి వేడుకను పురస్కరించుకొని మంగళవారం దాతల సహకారంతో తయారు చేయించిన మట్టి విగ్రహాలను భకులకు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరులు ముత్తుముల కృష్ణకిశోర్ రెడ్డి పాల్గొని విగ్రహాల పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామన్నారు. ప్రతి పూజకు ముందు విఘ్ననాడుని పూజించటం మన సంప్రదాయమని. మట్టి వినాయకుని పూజించడం అంటే ప్రకృతి ని ఆరాధించటమే నన్నారు. భాద్రపద మాసంలో చవితి నాడు వినాయకుని జన్మించిన సందర్భంగా ఆయన్ను పూజించటం మన ఆచారం అన్నారు. ఈ ఏడాది ఈ పర్వదినాన్ని వర్షాలు కూడా సమృద్ధిగా కురిసి జలాశయాలన్ని జలకళ సంతరించుకిన్నాయన్నారు . గిద్దలూరు నియోజకవర్గ ప్రజలకు కృష్ణకిశోర్ శుభాకాంక్షలు తెలిపారు మట్టి వినాయకుల తయారు చేసేందుకు సహకరించిన దాతలను ఆయన అభినందించారు. ఈసందర్భంగా కృష్ణ కిశోర్ ను దుశ్శాలువా తో సత్కరించారు నిర్వాహకులు. మరో సారి ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం మంగళవారం రేడియో బావిసెంటర్ నందు గల శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానం నందు నిర్వహించారు.

## ఎరువుల దుఖాణాలు తనిఖీ



**కొనకనమిట్ల పెన్ పవర్ ఆగస్టు 26 :** కొనకనమిట్ల మండల పరిధిలో ఎరువుల షాపులపై అధికారులు ఉక్కుపాదం మోపారు.పెదారికట్ల,ఎదురాళ్లపాడు గ్రామాల్లో మంగళవారం జరిగిన ఆకస్మిక తనిఖీల్లో పెద్ద ఎత్తున అక్రమాలు వెలుగులోకి వచ్చాయి.ఈ తనిఖీల్లో దర్శి వ్యవసాయ సహాయకులు కే.బాలాజీ నాయక్, తహసీల్దార్ సురేష్,ఏఎస్ఐ ముల్ల మహమ్మద్,వ్యవసాయ అధికారి ప్రకాశ్ రావు పాల్గొన్నారు. ముందుగా ఆయా షాపుల్లో బిల్లు పుస్తకాలు,దస్త్రాలను పరిశీలించారు.అనంతరం పెదారికట్ల గ్రామంలోని శ్రీ భాగ్యలక్ష్మి ట్రెడర్స్ వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన ఎరువులను అధికారులు గుర్తించి రూ.2,67,800 విలువ గల సల్ఫేట్,పొటాష్ ఎరువులను సీజ్ చేశారు.మందుల షాపుల యజమానులు ఎవరైనా ఇలాంటి అక్రమాలు చేస్తే లైసెన్సులు రద్దు చేసి,క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం అని స్పష్టం చేశారు. వ్యాపారులు బిల్ బుక్స్,రికార్డులు అప్డేట్ చేసుకోవాలని, ఎమ్మార్పీ ధరలకు మించి అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తప్పవు అని అన్నారు.రైతులను మోసం చేసే వ్యాపారులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

# సులభతర ప్రభుత్వ అనుమతులకు త్వరితగతిన చర్యలు : కలెక్టర్ రాజకుమారి గణియా




**నంద్యాల, పెన్ పవర్ ఆగస్టు, 26 :** జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకుగాను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందజేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై యువ పారిశ్రామికవేత్తలకు, పారిశ్రామికవేత్తలకు అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు చేయూతను ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం యువ పారిశ్రామికవేత్తలకు అండగా ఉంటుందన్నారు. పరిశ్రమల స్థాపనకు అవసరమయ్యే పెట్టుబడి సాయాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం అందించేలా చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం వైపు నుండి కూడా సులభతరంగా పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎక్కువ శాతం హార్టికల్చర్, పసుపు, సుగంధ ద్రవ్యాలు, పూలు, పండ్ల మొక్కల పెంపకం ఎక్కువ శాతం చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లాలో సుమారుగా 33 శాతం అటవీ ప్రాంతం ఉండగా, 1/3 వంతూ సాగు భూమి ఉండగా, అందులో ఎక్కువ శాతం వరి, జొన్న తదితర పంటలను పెద్ద ఎత్తున సాగు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నంద్యాల సోనా బియ్యాన్ని సరఫరా చేయడం జరుగుతోందన్నారు. అదే విధంగా పశు సంపద కూడా జిల్లాలో సమృద్ధిగా ఉందన్నారు. జిల్లాలోని బనగానపల్లె, డోన్ ప్రాంతాల్లో 90 శాతం సున్నపు రాయి పరిశ్రమలతో పాటు 10 శాతం ఇనుప ఖనిజం లవణాలు ఉండడం వల్ల మైనింగ్ కార్యకలాపాలు నిర్వహణకు పెద్ద ఎత్తున అవకాశాలు ఉంటాయన్నారు. అంతేకాకుండా స్థూల జిల్లా దేశీయ ఉత్పత్తి పెరుగుదలకు గాను వ్యవసాయం మరియు అనుబంధ కార్యకలాపాల ద్వారా 42 శాతం, సేవా రంగాలకు 39 శాతం, పరిశ్రమల పరంగా 19 శాతం ద్వారా సేవలు అందజేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు గాను రాష్ట్ర ప్రభుత్వం వైపు నుండి పూర్తి స్థాయి సహాయ సహకారాలు అందించే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయడానికి ఉత్సాహవంతులైన పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలన్నారు. సదరు సంస్థల ఏర్పాటుకు బ్యాంకర్స్ వైపు నుండి కూడా పూర్తి సహకారం అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జిఎం ఎస్.మహబూబ్ బాషా, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి, కార్మిక శాఖ సహాయక కమీషనర్ బషీరునిస్సా బేగం, కాలుష్య నియంత్రణ సంస్థ ఈఈ కిషోర్ రెడ్డి, పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.



## వార్డుల విభీకరణను వ్యతిరేకిస్తున్న స్థానికులు



**గాజువాక :పెన్ పవర్, ఆగస్టు 26:**విశాఖ పార్లమెంటు,గాజువాక నియోజకవర్గం లో ఉన్న 85, 79, 78 వార్డులు పెందుర్తి జోన్–2 లో కలపడాన్ని ప్రజలందరూ కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, ఒకవేళ పరిపాలన సౌలభ్యం కోసం విభజన చేస్తే గాజువాకను రెండు జోన్లుగా విభజించి అగనంపూడిలో జూన్ –2 ఏర్పాటు చేయవలసిందిగా విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు శ్రీ భరత్ గారిని 85 వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కర్రి దశేంద్ర ఆధ్వర్యంలో 85వ వార్డ్ నాయకులు కలిసి వినత పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో గాజువాక జోన్ లోనే ఆ యొక్క వార్డులు కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో, వార్డు ప్రధాన కార్యదర్శి విందుల రాజు, బండారు ఛందు, కసిపల్లి శ్రీను, పలక అచ్యుతు తదితరులు పాల్గొన్నారు..::.

## ఓటరు జాబితాలో మార్పులు చేర్పుల పై అభ్యంతరాలు ఉంటే తెలపండి

- డి.ఆర్.ఓ., వై. సత్యన్నారాయణ రావు



**అనకాపల్లి, పెన్ పవర్, ఆగష్టు 26:** ఓటరు జాబితా లో మార్పులు చేర్పుల పై అభ్యంతరాలు, పొరపాట్లు ఉంటే తమ దృష్టి కి తీసుకురావాలని జిల్లా రెవిన్యూ అధికారి వై సత్యన్నారాయణ రావు రాజకీయ పార్టీల నేతలు కు సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం వారు ఓటరు జాబితా ప్రక్రియ గురించి ప్రతి నెల రాజకీయ పార్టీల నేతలతో సమావేశాన్ని ఏర్పాటు చెయ్యమని ఆదేశించిన సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో వివిధ రాజకీయ పార్టీల నేతలతో మాసంతపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలోని సమస్యలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లాలనే లక్ష్యంతోనే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామని రాజకీయ పార్టీల నేతల కు డి.ఆర్.ఓ. తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు కొత్తగా ఓటరు నమోదు కొరకు, ఓటురు తొలగింపు కొరకు మరియు ఓటురు ఐ డి కార్డు సవరణాల కొరకు 1354 దరఖాస్తులు వచ్చాయన్నారు వీటి లో 820 ధరకూస్తులు పరిష్కరించామ న్నారు 534 దరఖాస్తులు పరిశీనాలలో ఉన్నాయన్నారు. పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాల ని డి అర్వో రాజకీయ పార్టీల ప్రతినిధుల ను కోరారు. ఓటరు జాబితా లోని మార్పులు చేర్పుల కు సంబంధించిన అభ్యంతరాలు, సమస్యలు ఉంటే తమకు తెలిపాలన్నారు. ఎన్నికల ప్రక్రియను బలోపేతం చేసేందుకు, పరస్పర అనుకూల మైన సలహాలు, సూచనలు అందించేందుకు రాజకీయ పార్టీలకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం కల్పించిన ఈ అవకాశాన్ని రాజకీయ పార్టీలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఈ మావేశంలో జిల్లా ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎస్ వి ఎస్ వాసు నాయుడు, ఉప తహసీల్దార్ ముజీబ్, తెలుగుదేశం పార్టీ ప్రతినిధి బి.శ్రీనివాస రావు, ఆప్ పార్టీ ప్రతినిధి కె.హరినాధబాబు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి జి గున్న బాబు, బి ఎస్పీ పార్టీ ప్రతినిధులు పి దుర్గ రావు, గంటా సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకై మట్టి వినాయక ప్రతిమలు పంపిణి





**గాజువాక : పెన్ పవర్ ఆగస్టు 26:**జీవీఎంసీ 87 వార్డు వడ్లపూడి సీత రామలింగేశ్వర స్వామి ఆలయం లో కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో మట్టి వినాయకుని విగ్రహాలు పంపిణి చేసారు.వార్డు కార్పొరేటర్ బోండా జగన్నాధం పాల్గొని భక్తులు కి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ లో భాగంగా రంగులు, ప్లాస్ట్ ఆఫ్ పారిస్ తో చెరువులు, నదులు కలుషితం అవ్వుతున్నాయి అని భూగర్భ జలాలు కూడా కలుషితం అయిపోతున్నాయి అని అందుకే మట్టి వినాయక ప్రతిమలు కి పూజలు నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమం లో ఆలయ కమిటీ సభ్యులు మాటూరి రాము, కర్రి కృష్ణ, మింది గోవిందా, కోరుకొండ శ్రీధర్, మింది పేరయ్య, పాల్గొన్నారు అనంతరం వార్డు పరిధిలో తిరుమల నగర్లో కాలనీ అసోసియేషన్ సభ్యులు ఆధ్వర్యంలో కూడా మట్టి విగ్రహాలు పంపిణి చేసారు. ఈ కార్యక్రమం లో పరమానందం, విశ్వేశ్వర్రావు, సన్యాసిరావు. వసంత రెడ్డి.శ్రీధర్,తదితరులు పాల్గొన్నారు.

# వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచాలి

- ఆహార పదార్థాలు కలుషితం కాకుండా చూడాలి
- ఈ నెల చివరి నాటికి శతశాతం ప్రవేశాలు పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్.
- క్షేత్ర స్థాయి అధికారులతో సమీక్ష



**అనకాపల్లి (కలెక్టరేట్ ), ఆగష్టు 26 :** వర్షాకాలం నేపథ్యంలో ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో అన్ని రకాల పరిశుభ్రత, భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులకు ఆదేశించారు. ఆహారం కలుషితం కాకుండా హాస్టల్ వార్డెన్లు అప్రమత్తతగా ఉండాలని, అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చించారు.

శిధిలావస్థలో ఉన్న భవనాలు గుర్తించి , విద్యార్థులను పూర్తి సురక్షిత భవనాలలో ఉంచాలన్నారు. పూర్తి భద్రతా ప్రమాణాలు, రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంగళవారం సాయంత్రం జిల్లాలో సాంఘిక సంక్షేమ,. వెనకబడిన తరగతుల, ట్రైబల్ వెల్ఫేర్, గురుకులాలు, ఇంటర్మీడియట్ , విద్యా శాఖ , కాలేజీ ఎడ్యుకేషన్ తదితర అధికారులతో వసతి గృహాల పరిశుభ్రత, ప్రవేశాలు , పిల్లల భద్రతా ప్రమాణాలు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున సంక్షేమ వసతి గృహాలలో అన్ని రకాల పరిశుభ్రత చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అన్ని వసతి గృహాలలో వెంటనే వాటర్ ట్యాంకులు శుభ్రపరిచి, క్లోరినేషన్ తప్పక చేయాలని అన్నారు. ఇది ప్రతి పదిహేను రోజుల వ్యవధిలో తప్పకుండా చేయాలని పేర్కొన్నారు. ఆహారం కలుషితం కాకుండా వంట గదులు పరిశుభ్రంగా ఉంచుకోవాలి అని తెలిపారు. కూరగాయలు, ఆకుకూరలు శుభ్రంగా కడగాలి అన్నారు. వసతి గృహాలలో ఎక్కడా చెత్త, వ్యర్థాలు లేకుండా చూడాలన్నారు. ప్రతి స్విచ్ పాయింట్ పూర్తి భద్రతగా ఉండాలని అన్నారు. ప్రతి వసతి గృహంలో దోమల తెరలు అన్ని కిటికీలకు తప్పక ఉండాలని, లేని చోట వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థికి చేతి పరిశుభ్రత చేసేలా అలవాటు చేయాలన్నారు. విద్యార్థులకు కాచి చల్లార్చిన నీరు అందించాలని సూచించారు. ప్రధమ చికిత్స కిట్లు ఎల్లపుడూ అందుబాటులో ఉండాలని అన్నారు. ప్రతి నెలా మెడికల్ స్క్రీనింగ్ క్రమం తప్పకుండా చేసి వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ప్రతి వసతి గృహంలో మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా, పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. నిరంతర నీటి సరఫరా, పరిశుభ్రత, ఫ్యాన్లు, వెలుతురు సరిగా ఉండేలా లైటింగ్ ఉండాలన్నారు. నిబంధనల మేరకు మెనూ పాటించాలని, వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని అవసరమైన జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు విధిగా చాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు విధిగా పాటించాలన్నారు. వసతి గృహాలలో విద్యార్థులచే పనులు చేయించరాదన్నారు. బాలికల వసతి గృహాలలో ప్రహరీ, ఫెన్సింగ్ తప్పనిసరిగా ఉండాలన్నారు. వసతి గృహాలలో నైట్ వాచ్మెన్లు ఉండాలన్నారు. ప్లస్ టూ వసతి గృహాలలో నైట్ వాచ్మెన్లు విధిగా పరిస్థితులు గమనించాలన్నారు. ఈ నెలాఖరు నాటికి అన్ని వసతి గృహాలలో , కళాశాలల లో ప్రవేశాలు శత శాతం జరగాలని అన్నారు.

ఈ సమావేశంలో జిల్లా వెనుకబడిన తరగతుల, సాంఘిక, గిరిజన సంక్షేమ అధికారులు కె. శ్రీదేవి, రామనందం, మంగవేణి, సాంఘిక, గిరిజన, వెనుకబడిన తరగతుల రెసిడెన్షియల్ పాఠశాలల కో– ఆర్డినేటర్లు, వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా మోడల్ స్కూల్, కె.జి.బి.వి. ల ప్రిన్సిపాల్స్, వసతిగృహ సంక్షేమ వసతి గృహ అధికారులు పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన

**కలెక్టరేట్లో మట్టి గణపతుల పంపిణీ**

**అనకాపల్లి, పెన్ పవర్, ఆగష్టు 26:–**

అనకాపల్లి జిల్లా కలెక్టరేట్లో వినాయక చవితి పండుగ పురస్కరించుకుని మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి అధికారులు, ఉద్యోగులకు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను కాలుష్య నియంత్రణ మండలి ఉచితంగా పంపిణీ చేస్తుందని తెలిపారు. పర్యావరణ సమతుల్యత కోసం మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రసాయనిక రంగులతో రూపొందించిన విగ్రహాల కారణంగా జల వనరులు కలుషితం అయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రజలందరూ మట్టి గణపతులను ప్రతిష్ఠించి, పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఈ.ఈ పి.వి.ముంకర, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# జారీ: జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి, అనకాపల్


## కలెక్టరేట్లో మట్టి గణపతుల పంపిణీ

అనకాపల్లి జిల్లా కలెక్టరేట్లో వినాయక చవితి పండుగ పురస్కరించుకుని మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి అధికారులు, ఉద్యోగులకు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను కాలుష్య నియంత్రణ మండలి ఉచితంగా పంపిణీ చేస్తుందని తెలిపారు. పర్యావరణ సమతుల్యత కోసం మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రసాయనిక రంగులతో రూపొందించిన విగ్రహాల కారణంగా జల వనరులు కలుషితం అయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రజలందరూ మట్టి గణపతులను ప్రతిష్ఠించి, పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఈ.ఈ పి.వి.ముంకర, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.


- ఈవీఎం గోదాముల వద్ద అప్రమత్తంగా ఉండాలి
- రాజకీయ పార్టీల నేతల సమక్షంలో ఈవిఎం గోదాములను తనిఖీ చేసిన డి అర్వో వై. సత్యన్నారాయణ రావు



**అనకాపల్లి, పెన్ పవర్, ఆగష్టు 26:**ఈ వీ ఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ ) గోదాముల వద్ద సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యన్నారాయణ రావు ఆదేశించారు. త్రైమాసిక తనిఖీలో భాగంగా మంగళవారం ఉదయం జిల్లా ఎస్.పి. కార్యాలయం ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోదాములను అనకాపల్లి వివిధ రాజకీయ పార్టీల నేతలతో కలిసి తనిఖీ చేసిన డిఅర్వో ఈవీఎం గోదాముల వద్ద పరిస్థితులను పరిశీలించి సీసీ కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. తాళాలు తీయించి గోదాముల లోపల ఉన్న ఈవిఎం లను, అగ్నిమాపక పరికరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. భద్రతా ప్రమాణాలు, లాగ్ బుక్ నిర్వహణ ఇతర అంశాలపై రాజకీయ పార్టీల నేతలతో డి అర్వో మాట్లాడారు. పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గ ల వారీగా భద్ర పరిచిన ఈవీఎంల స్థితిగతులను డి అర్వో కు ఎన్నికల విభాగం అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎస్ వి ఎస్ వాసు నాయుడు, అనకాపల్లి అగ్నిమాపక స్టేషన్ ఫైర్ ఆఫీసర్, పి నాగేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ ప్రతినిధి బి.శ్రీనివాస రావు, ఆప్ పార్టీ ప్రతినిధి కె.హరినాధబాబు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి జి గున్న బాబు, బి ఎస్పీ పార్టీ ప్రతినిధులు పి దుర్గ రావు, గంటా సూరిబాబు , ఎన్నికల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత





**గాజువాక :పెన్ పవర్, ఆగస్టు 26:**పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అనీ గాజువాక తెలుగుయువత అధ్యక్షుడు బలగ బాలు నాయుడు అన్నారు .

వినాయక చవితి పురస్కరించుకొని బి బి ఎన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 73వ వార్డు పరిధి చిన నడిపూరు, కొత్త కర్ణవాణి పాలెం, గోంతినవాని పాలెం సనత్ నగర్, పైడిమాంబ కాలనీ, సింహాగిరి కాలనీలో ప్రజలకు 3 వేల మట్టి వినాయకుల ప్రతిమలను ఉచితంగా పంపిణి చేసారు

ఈ సందర్బంగా బాలు నాయుడు మాట్లాడుతూ వినాయక చవితిని మట్టి వినాయక ప్రతిమతోనే జరుపుకోవాలనే సంకల్పంతో గత ఆరు సంవత్సరాలనుండి వార్డులో మట్టి వినాయక ఉచిత పంపిణి కార్యక్రమం చేపడుతున్నామని దానిలో భాగంగా ఈ ఏడు కూడా 73వ వార్డులో ప్లాస్టర్ అఫ్ పారిస్ రహిత వినాయక చవితి లక్ష్యంగా ఇంటింటికి మట్టి వినాయక పంపిణి చేయడం జరిగిందని తెలిపారు ప్లాస్టర్ అఫ్ పారిస్ తో తయారు చేసే విగ్రహలు వల్ల మన చెరువులు, కుంటలు కలుషితం అవుతాయని పర్యావరణ సమాతుల్యం దెబ్బతింటుందని తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీ పెద్దలు, వార్డు టీడీపీ సీనియర్ నాయకులు, మహిళ కార్యకర్తలు అధిక సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కసింకోట పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ

**రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్స్ గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలి: విశాఖపట్నం రేంజ్ డీఐజీ శ్రీ గోపీనాథ్ జట్టి, ఐపీఎస్**



**కసింకోట పెనపవర్,ఆగస్టు26:** వార్షిక తనిఖీల్లో భాగంగా విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి, మంగళవారం అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాతో కలిసి కసింకోట పోలీస్ స్టేషన్ను సందర్శించి తనిఖీ చేపట్టారు.ఈ సందర్భంగా డీఐజీకి ఎస్పీ తుహిన్ సిన్హా, సబ్ డివిజన్ డీఎస్పీ ఎం.శ్రావణి, కసింకోట ఇన్స్పెక్టర్ స్వామి నాయుడు పూలమొక్కలు అందజేసి సాదర స్వాగతం పలికారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించిన డీఐజీ గారు, పోలీస్ స్టేషన్ పరిసరాలు, రికార్డులు, దర్యాప్తు విధానాలను పరిశీలించారు.

గంజాయి ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా పై పటిష్ట చర్యలు తీసుకోవాలని, ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, మత్తు పదార్థాలు వాడేవారిని గుర్తించి కౌన్సిలింగ్ ఇవ్వాలని, వారిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.సైబర్ నేరాలపై గ్రామ స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలు తమ బ్యాంకు ఖాతాలు, వ్యక్తిగత వివరాలు సురక్షితంగా అవగాహన కల్పించాలన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసి బ్లాక్ స్పాట్స్ను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ ఎన్ఫోర్స్మెంట్ కఠినంగా అమలు చేయాలని సూచించారు.కేసుల రికవరీ శాతం పెంచాలని, ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మహిళా చట్టాలపై అవగాహన కల్పించి, ప్రతి మహిళకు రక్షణ కల్పించేందుకు పోలీస్ శాఖ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.గ్రామస్థాయి వేదికల ద్వారా నేరాలకు సంబంధించిన సమాచారం పోలీసులకు చేరవేయాలని, ప్రజల సమస్యలను సానుకూలంగా పరిష్కరించేందుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు.

నేరాలు నివారించేందుకు మరియు నేరస్తులను గుర్తించేందుకు సీసీటీవీ కెమెరాల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేసి అవి ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

అనంతరం పోలీస్ సిబ్బందితో సమావేశమై, నిబద్ధత, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి, ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండి, నేరాలను అరికట్టడంలో కృషి చేయాలని సూచించారు. సిబ్బంది సమస్యలను స్వయంగా విని, పరిష్కారానికి హామీ ఇచ్చారు.

# భార్య శవాన్ని ముక్కలు చేసిన భర్త చేసిన అరాచకాలివీ!



**హైదరాబాద్ పెన్ పవర్:** వికారాబాద్ జిల్లాలో చోటుచేసుకున్న ఒక అత్యంత క్రూరమైన ఘటన సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. భార్యపై అనుమానం, పరువు తీసిందనే కక్షతో మహేందర్‌రెడ్డి అనే వ్యక్తి తన భార్య స్వాతిని దారుణంగా హత్య చేసి, ఆమె మృతదేహాన్ని ముక్కలు చేసి నదిలో పడేశాడు. ప్రేమ వివాహం చేసుకున్న జంట మధ్య అనుమానం ఎలా ఇంతటి దారుణానికి దారితీసిందో ఈ ఘటన వెల్లడిస్తుంది.

**అనుమానం పెరిగి... గొడవలు శిఖరం చేరి**

మహేందర్‌రెడ్డి, స్వాతి ప్రేమ వివాహం చేసుకున్నారు. పెళ్లి అయిన నాటి నుంచే మహేందర్‌కి భార్యపై అనుమానం పెరిగింది. ఈ అనుమానం కారణంగా ఇద్దరి మధ్య నిత్యం గొడవలు జరిగేవి. ఒకసారి గర్భవతి అయిన స్వాతి మొదటి సారి అబార్షన్‌కు గురైనప్పుడు ఈ అనుమానం మరింత ముదిరింది. ఈ విషయంపై తీవ్రమైన గొడవ జరిగి కేసు కూడా నమోదైంది. తర్వాత రాజీ కుదిరినా, మహేందర్ మనసులో అనుమానాలు చల్లారలేదు. స్వాతి కాల్‌సెంటర్‌లో ఉద్యోగం చేస్తుండగా, అది మాన్పించేలా ఒత్తిడి తెచ్చాడు. పదేపదే జరిగే గొడవలతో విసిగిపోయిన స్వాతి పెద్దల సమక్షంలో పంచాయతీలు పెట్టించేది.

**మానవత్వం మరిచి.. క్రూరంగా హత్య**

ఆగస్టు 27న వైద్య పరీక్షల కోసం పుట్టింటికి వెళ్తానని స్వాతి చెప్పడంతో మహేందర్‌లో అనుమానం మరింత పెరిగింది. ఇదే విషయంపై గొడవ పడిన తర్వాత మహేందర్ స్వాతిని హత్య చేశాడు. అనంతరం భయంకరమైన రీతిలో ఒక హ్యాక్సా బ్లేడ్‌తో మృతదేహాన్ని ముక్కలుగా చేశాడు. శరీర భాగాలను పెద్ద నల్ల కవర్లలో వేర్వేరుగా ప్యాక్ చేశాడు. హత్య తర్వాత ఆ మృతదేహ భాగాలను తీసుకెళ్లి మూసీ నదిలో పడేశాడు. కాళ్లను యూరియా బస్తాలో పెట్టి, రాయికి కట్టి నదిలో వేయగా, తలను ఒక కాలేజీ బ్యాగులో వేసి తాడుతో కట్టి పడేశాడు. మొండెం మాత్రం ఇంట్లో వదిలిపెట్టాడు.

**నేరం తర్వాత నిస్సంకోచంగా**

భార్యను చంపిన కొన్ని క్షణాల తర్వాత మహేందర్ వ్యవహరించిన తీరు అతని కర్కశత్వాన్ని చూపిస్తుంది. హత్య తర్వాత పాన్‌షాప్ దగ్గర ఆగి సిగరెట్ తాగడం, ఆ తర్వాత తన సోదరికి ఫోన్ చేసి "స్వాతి గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది" అని అబద్ధం చెప్పడం చూస్తే అతను ఎంత నిస్సంకోచంగా ఉన్నాడో అర్థమవుతుంది. పోలీసులు విచారణలో భాగంగా ప్రతాపసింగారం దగ్గర మూసీ నదిలో డీఆర్‌ఎఫ్ బృందాలతో మృతదేహ భాగాల కోసం వెతికారు. కొన్ని శరీర భాగాలను కనుగొన్న తర్వాత స్వాతి మొండేన్ని పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసుల ప్రశ్నలకు తట్టుకోలేకపోయిన మహేందర్‌రెడ్డి చివరకు నేరాన్ని అంగీకరించాడు.

**కుటుంబ సభ్యుల ఆందోళన**

ఈ ఘటన తర్వాత స్వాతి స్వగ్రామం కామారెడ్డిగూడలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. స్వాతి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు ఆందోళనకు దిగారు. "అంత్యక్రియలు అత్తింటివారే చేయాలి" అని డిమాండ్ చేశారు. అయితే, మహేందర్‌రెడ్డి తల్లిదండ్రులు ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లిపోవడంతో స్వాతి తండ్రి రాములు సమాజ పెద్దల సలహాతో అంత్యక్రియలు నిర్వహించారు.


ఈ దారుణమైన ఘటన భార్యాభర్తల మధ్య అనుమానం ఎంతటి భయంకరమైన పరిణామాలకు దారితీస్తుందో మరోసారి రుజువు చేసింది. ప్రేమపెళ్లి చేసుకున్న భార్యను మహేందర్‌రెడ్డి అత్యంత క్రూరంగా ముక్కలు చేయడం సమాజాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.

# ప్రధాని మోదీ చేతుల మీదుగా మారుతీ సుజుకీ ఈవీ కార్ ఆరంభం.. అదే లక్ష్యం!




**హైదరాబాద్ పెన్ పవర్:** మార్కెట్లోకి కొత్త కొత్త కార్లు వస్తున్నాయి. టెక్నాలజీ పెరగడంతో ఎన్నో కొత్త ఫీచర్లతో ఉండే కార్లు వస్తున్నాయి. కొన్ని ఎలక్ట్రిక్ వాహనాలు అయితే మరికొన్ని పెట్రోల్, డీజిల్ తో నడిచే వాహనాలు మార్కెట్లోకి వస్తున్నాయి. అయితే తాజాగా నరేంద్ర మోడీ మారుతి సుజుకీ ఈ విటారా అనే ఎలక్ట్రిక్ కార్ ని తొలిసారి ప్రారంభించారు. ఈ మారుతి సుజుకీ ఈవి కార్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధాని ఎన్నో ఆసక్తికర విషయాలు మాట్లాడారు. తాజాగా గుజరాత్ లోని హన్సల్ పూర్ లో జరిగిన సుజుకి మోటర్ ప్లాంట్ లో మారుతి సుజుకి ఈ విటారా అనే కారు , హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్స్ ఉత్పత్తి చేసే మొదటి ప్లాంట్ ను జెండా ఊపి ప్రారంభించారు. అయితే ఎలక్ట్రిక్ కార్ కి సంబంధించి మోడీ తన సోషల్ మీడియా ఖాతాలో ఇంట్రెస్టింగ్ ట్వీట్ కూడా పెట్టారు. "భారతదేశం స్వావలంబన చేస్తున్న అన్వేషణలో ఇది ఒక ప్రత్యేకమైన రోజు" అంటూ చెప్పుకొచ్చారు. అలాగే మారుతి సుజుకి ఈవీ కార్లను ప్రపంచవ్యాప్తంగా 100 దేశాలకు ఎగుమతి చేయాలి అని చెబుతూ ఎలక్ట్రిక్ కారుకి జెండా ఊపి ప్రారంభించారు. అలాగే ఈ విటారా మొదటి ఎలక్ట్రిక్ కార్ యూకే కి ఎగుమతి చేస్తున్నారు. ఇక ప్రపంచవ్యాప్తంగా మొదటిసారి ఈ విటారా లను యూరప్ లో గత సంవత్సరం చివర్లో ప్రవేశపెట్టారు. అలాగే భారతదేశంలో జరిగిన భారత్ మొబిలిటీ షో 2025 లో దీన్ని ప్రదర్శించారు. ఈ మారుతి సుజుకి ఈ విటారా కారు టయోటా సహకారంతో రూపొందించబడిన 40 %ూా% డెడికేటెడ్ ఈవీ ఫ్లాట్ ఫామ్ పై నిర్మించబడింది. అలాగే ఈ విటారా కారులో రెండు రకాల బ్యాటరీ సదుపాయాలు ఉన్నాయి. ఒకటి 49%ఎౌష్ట్ర% కాగా.. మరొకటి 61%ఎౌష్ట్ర%. ఈ రెండు బ్యాటరీలలో 49 %ఎౌష్ట్ర% తో వచ్చే కారు 189 %చీఎ% టార్క్ ని విడుదల చేయగా..144 హెచ్పీ శక్తిని కలిగి ఉంది. అలాగే 61 %ఎౌష్ట్ర% బ్యాటరీతో వచ్చే కారులో 189 ఎన్ఎం టార్క్, 174 బిహెచ్పిని విడుదల చేస్తుంది. అలాగే ఈ కారులో ఉన్న అతిపెద్ద బ్యాటరీ 500 కిలోమీటర్లకు పైగా వెళ్తుందని కంపెనీ ప్రదర్శించిన వీడియోలో పేర్కొన్నారు. ఇక మారుతి సుజుకీ కంపెనీ జనవరిలో ఈ విటారా ఎలక్ట్రిక్ కారుని ఆవిష్కరించింది. అంతేకాకుండా ఈ ఈవీ కార్ ని 100 దేశాలకు ఎగుమతి చేయాలన్నదే ఈ కంపెనీ లక్ష్యం. ఇండియాలో మారుతి సుజుకి కంపెనీ ఈ ఈ – విటారా ఎలక్ట్రిక్ కార్లను తయారు చేయడం కోసం రూ.2100 కోట్లు ఖర్చు చేసినట్టు ఈ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సీఈఓ హిసాచి టకేయుచి తెలిపారు. అలాగే ఈ కార్ల కోసం తొలి దశలో 100 ప్రధాన నగరాల్లో ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయాల్ని కూడా కల్పించబోతున్నట్లు తెలిపారు. అలాగే ఈ విటారా ఎలక్ట్రిక్ కార్లను కొనుగోలు చేసే వారికి స్పెషల్ గా ఇన్స్టాలేషన్ సపోర్ట్, స్మార్ట్ హోమ్ చార్జర్ లు కూడా అందిస్తున్నారు.

# సహస్ర హత్య కేసు : బాలుడి ఫోన్ చూసి షాకైన పోలీసులు




**హైదరాబాద్ పెన్ పవర్:** హృదయం కలచివేసే కూకట్‌పల్లి సహస్ర హత్య కేసు అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు పదేళ్ల బాలుడు కావడం సమాజాన్ని మరింత కలవరపెడుతోంది. చిన్న వయసులోనే ఒక పిల్లవాడు ఇంత దారుణానికి ఎందుకు పాల్పడ్డాడు, దాని వెనుక ఉన్న కారణాలు ఏమిటి? అనే విషయాలు ఇప్పుడు బయటపడుతుండడం సంచలనమవుతోంది.

**ఇంటి వాతావరణం.. మానసిక ఒత్తిడి**

సాధారణంగా పిల్లలు తమ చుట్టూ ఉన్న ప్రపంచం నుండే నేర్చుకుంటారు. కానీ ఈ కేసులో బాలుడి జీవితం బాల్యం నుంచే విషాదంతో నిండిపోయింది. ప్రకాశం జిల్లాకు చెందిన ఈ కుటుంబం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. బాలుడి తండ్రికి మద్యపానం అలవాటు ఉండడం, ఇంట్లో తరచూ గొడవలు జరగడం వల్ల అతడి మానసిక ఆరోగ్యం దెబ్బతింది. కుటుంబంలో సురక్షితమైన వాతావరణం, ప్రేమ, ఆప్యాయతలు లభించనప్పుడు పిల్లలు బయటి ప్రపంచంలో ఆశ్రయం వెతుక్కుంటారు.

అంతేకాకుండా బాలుడు బలహీనంగా ఉండడం వల్ల తోటి పిల్లల ఎగతాళికి గురయ్యాడని పోలీసులు తెలిపారు. ఇది అతడిలో ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసి, లోలోపల ఒక రకమైన అసహనాన్ని, కోపాన్ని పెంచింది. ఈ పరిస్థితుల్లో అతడికి యూట్యూబ్, వెబ్ సిరీస్‌లు కొత్త ప్రపంచంలా అనిపించాయి. అక్కడ అతడు తన ఊహాలోకంలో బలంగా, ధైర్యంగా ఉండే పాత్రలను సృష్టించుకున్నాడు.

**డిజిటల్ ప్రపంచం: ప్రమాదకరమైన ప్రభావం**

సహస్ర హత్య కేసులో వెలుగులోకి వచ్చిన అత్యంత ఆందోళనకరమైన విషయం బాలుడి ఫోన్లో ఉన్న కంటెంట్. పోలీసులు అతడి ఫోన్‌ను పరిశీలించగా నేరాలకు సంబంధించిన వీడియోలు, నేరం చేసి ఎలా తప్పించుకోవచ్చో చెప్పే యూటెక్స్ , వెబ్ సిరీస్ సన్నివేశాలు ఉన్నాయి. ఒక చిన్న పిల్లవాడికి ఇవన్నీ ఎలా తెలిసాయి, ఎందుకు చూశాడు? అనే ప్రశ్నలకు సమాధానం అతని మానసిక స్థితిలో ఉంది.

అతడు తనను తాను ఒక "క్రిమినల్ వరల్డ్"లో ఊహించుకున్నాడని పోలీసులు తెలిపారు. తన బలహీనతలను కప్పిపుచ్చుకోవడానికి, తోటివారి ముందు తాను భయంకరమైనవాడినని నిరూపించుకోవడానికి ఇటువంటి కంటెంట్‌ను చూశాడు. అంతటితో ఆగకుండా తన ఆలోచనలను ఒక లేఖలో కూడా రాశాడు. అందులో దొంగతనం చేసే విధానం, కత్తితో బెదిరించడం, అవసరమైతే గ్యాస్ లీక్ చేసి పేల్చేయడం వంటి ప్రణాళికలు ఉన్నాయి. ఇది అతడి ఊహాలోకం ఎంత ప్రమాదకరంగా మారిందో స్పష్టం చేస్తోంది.

**హత్య వెనుక ఉద్దేశం: బెదిరించడమా? లేక చంపడమా?**

బాలిక తల్లిదండ్రులు ఇది ఉద్దేశపూర్వక హత్యేనని వాదిస్తున్నప్పటికీ, పోలీసుల ప్రాథమిక విచారణ మరో కోణాన్ని చూపిస్తోంది. "చంపాలనే ఉద్దేశం కాకుండా బెదిరించాలనే ఉద్దేశం ఉండొచ్చు" అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే హత్య జరిగిన తర్వాత బాలుడు కత్తిని శుభ్రం చేయడం, దుస్తులను వాషింగ్ మెషీన్‌లో వేసి సాక్ష్యాలను తొలగించడానికి ప్రయత్నించడం అతడి చాకచక్యాన్ని, నేరాలకు సంబంధించిన అవగాహనను సూచిస్తుంది. ఈ చర్యలన్నీ అతడు వెబ్ సిరీస్‌లు, సినిమాలు చూసి నేర్చుకున్నవేనని పోలీసులు భావిస్తున్నారు. ఎఫ్‌ఎస్‌ఎల్ పరీక్షల్లో రక్తపు ఆనవాళ్లు బయటపడటంతో బాలుడే నేరానికి పాల్పడ్డాడని నిర్ధారించారు.

**సమాజం ఏం నేర్చుకోవాలి?**

ఈ సంఘటన ఒక వ్యక్తిగత కుటుంబ సమస్య మాత్రమే కాదు, ఇది సమాజం మొత్తం ఆలోచించాల్సిన విషయం. పిల్లలు ఆన్‌లైన్‌లో ఏ కంటెంట్ చూస్తున్నారు, వారు ఎలాంటి ప్రభావాలకు గురవుతున్నారు అనే విషయాలపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. తల్లిదండ్రులు తమ పిల్లలతో ఎక్కువ సమయం గడపడం, వారి మానసిక స్థితిని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. అంతేకాకుండా ఇంటర్నెట్ , డిజిటల్ కంటెంట్‌పై సరైన పర్యవేక్షణ ఉండాలి.

ఒక పిల్లవాడు పదేళ్ల వయసులోనే ఒక "క్రిమినల్ వరల్డ్" సృష్టించుకోవడం సమాజంలో పెరిగిపోతున్న హింసాత్మక కంటెంట్ ప్రభావానికి నిదర్శనం. ఈ సంఘటన భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే, పిల్లల మానసిక ఆరోగ్యానికి, కుటుంబ వాతావరణానికి, ఆన్‌లైన్ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని మనందరికీ ఒక హెచ్చరిక.

# వద్దంటే రుద్దుతున్నారు.. ఏపీలో అధికార, ప్రతిపక్ష పార్టీల్లో అంతే.. !



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీలోని అధికార, ప్రతిపక్ష పార్టీల్లో నాయకులకు ఇచ్చిన పదవుల వ్యవహారం ఇబ్బందిగా మారింది. అధికార టీడీపీలో విపక్ష వైసిపి లో కూడా గత ఎన్నికల తర్వాత క్షేత్రస్థాయిలో నాయకులకు పదవులు అప్పగించారు. వీరంతా పార్టీని డెవలప్ చేస్తారని, ప్రజల్లోకి వెళ్లి పార్టీ తరపున పని చేస్తారని అధినాయకులు భావించారు. అయితే, వారు అనుకున్న విధంగా అయితే క్షేత్రస్థాయిలో నాయకులు పనిచేయడం లేదనేది స్పష్టంగా తెలుస్తోంది. టిడిపిని తీసుకుంటే కార్పొరేషన్ పదవులు సహా నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తున్నారు.

ఇప్పటికే చాలా పదవులు భర్తీ చేశారు. మరి వీరంతా ఎక్కడున్నారు.. ఏం చేస్తున్నారు.. అనే విషయం గమనిస్తే చాలామంది అసంతృప్తితో రగిలిపోతున్నారు. తమకు, తమ స్థాయికి తగిన విధంగా పదవులు దక్కలేదని మెజారిటీ నాయకుల అభిప్రాయపడుతున్నారు. అయితే, ఈ విషయాన్ని పైకి చెప్పలేక మనసులో దాచుకోలేక పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఇక ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల విషయంలో కూడా తాము సిఫారసు చేసిన వారికి పథకాలు అందడం లేదని, తమ మాటకు తమ సిఫారసులకు కూడా జిల్లా స్థాయి అధికారులు కానీ ఎమ్మెల్యేలు ఎంపీలు గాని ఏమాత్రం విలువ ఇవ్వడం లేదని నేతలు గగ్గోలు పెడుతున్నారు. ఇది పార్టీలో అంతర్గతంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఉదాహరణకు పార్టీ రాష్ట్ర స్థాయి నాయకత్వంలో కీలక ప్లేసులో ఉన్న ఓ నేత సుమారు పదిమందికి తల్లికి వందనం పథకం కింద సిఫారసు చేశారు. ఇప్పటివరకు ఒక్క దరఖాస్తు కూడా సొమ్ములు పడలేదు. కనీసం పరిశీలనకు కూడా నోచుకోలేదు. అదేవిధంగా ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన మాజీ మంత్రి, ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న ఒక నేత అన్నదాత సుఖీభవ కింద తన నియోజకవర్గంలోని 9 మందికి సిఫారసు చేశారు. వారికి కూడా ఇంతవరకు నిధులు పడలేదు. ఎమ్మెల్యే స్థాయిలోనే ఉన్న వారికి కూడా ఇలా జరుగుతుంటే ఇక తమ పరిస్థితి ఏంటి అని నామినేటెడ్ పదవులు తీసుకున్నవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు తమ స్థాయికి తగిన విధంగా పదవులు లేవని, సుదీర్ఘ కాలంగా పార్టీలో సేవలు అందిస్తున్నామని తమను సరైన విధంగా గుర్తించలేకపోతున్నారన్నది మరికొందరి బాధగా ఉంది. ఇది పార్టీ కార్యక్రమాల పైన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లడం పై కూడా తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఇక, వైసిపిలో జిల్లా స్థాయి ఇన్చార్జిలను, నియోజకవర్గం ఇంచార్జ్‌లను ఆ పార్టీ అధినేత జగన్ ప్రకటించి నెలలు గడిచిపోయాయి. కానీ ఇప్పటివరకు జిల్లా స్థాయిలో గాని నియోజకవర్గ స్థాయిలో గాని పట్టుమని పదిమంది కూడా స్పందించలేదు. నియోజకవర్గంలో పర్యటించడం లేదు. పార్టీని డెవలప్ చేయడం లేదు. ఈ పరిణామాలను గమనిస్తే తమ స్థాయికి తమ ప్రాంతానికి సంబంధం లేకుండా పదవులను కట్టబెట్టారన్న ఆవేదన వైసీపీలో కూడా కనిపిస్తోంది. దీనిని సరిచేయాలనేది ఆ నాయకులు కోరుతున్న మాట. కానీ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఇంతకుమించి చేయలేమన్నది టిడిపి ఇటు వైసిపి రెండు చెబుతున్నాయి. ఇదే కొనసాగితే పదవులు ఇచ్చిన ప్రయోజనం ఎంతవరకు ఉంటుందనేది, పార్టీలకు ఏ మేరకు మేలు జరుగుతుందనేది ఆలోచన చేయాల్సిన అవసరం కనిపిస్తుంది.

# ఇంకో 6 నెలలే ట్రంప్ ఆరోగ్యం షాకింగ్ నిజం వెలుగులోకి..



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్యంపై మరోసారి ఊహాగానాలు చెలరేగుతున్నాయి. తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక టిక్‌టాక్ వీడియోలో ట్రంప్ కేవలం ఆరు నుండి ఎనిమిది నెలలే బతుకుతారనే వాదన వినిపిస్తోంది. ఎపిస్టెమిక్ క్రైసిస్ అనే ఖాతాలో పోస్ట్ అయిన ఈ వీడియోలో, తనను డాక్టరేట్ పొందిన హోమ్ హెల్త్ ఫిజికల్ థెరపిస్ట్‌గా పరిచయం చేసుకున్న వ్యక్తి, ట్రంప్‌కి కంజెస్టివ్ హార్ట్ ఫెయిల్యూర్ (హృద్రోగ సమస్య), క్రానిక్ కిడ్నీ వ్యాధి ఉన్నాయని పేర్కొన్నాడు.

ఆ వ్యక్తి మాట్లాడుతూ "ట్రంప్ పాదాలు, చీలమండలలో వాపు దీనికి సంకేతం. వాపు పెరుగుతున్నందునే ఆయన ఎక్కువగా సభల్లో డెస్క్ వెనుక కూర్చుంటున్నారు. ఈ సంకేతాలు చూస్తుంటే ఆయన ఇంకో ఆరు నుండి ఎనిమిది నెలలు మాత్రమే జీవించే అవకాశం ఉంది" అని అన్నాడు. ఇక, ఇటీవల దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్‌తో సమావేశమైనప్పుడు ట్రంప్ చేతులపై గాయాలున్న ఫోటోలు బయటకు రావడం, ఆయన ఆరోగ్యం మీద అనుమానాలకు మరింత బలం చేకూర్చింది. గతంలో ఈ గాయాలను మేకప్‌తో దాచారని కూడా సోషల్ మీడియాలో చర్చ నడుస్తోంది. అయితే, ఈ ఊహాగానాలన్నింటిని వైట్ హౌస్ ఖండించింది. "అధ్యక్షుడు ట్రంప్ ప్రజల మనిషి. ఆయన ప్రతిరోజూ వేలాది మందిని కలుస్తున్నారు, వారితో కరచాలనం చేస్తున్నారు. ఆయన నిబద్ధత, శక్తి ప్రతి రోజు రుజువవుతోంది. ఇలాంటి వదంతులు పూర్తిగా అబద్ధం" అని వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ స్పష్టం చేశారు. మొత్తానికి, సోషల్ మీడియాలో ట్రంప్ ఆరోగ్యంపై వినిపిస్తున్న వాదనలకు అధికారికంగా ఎలాంటి ఆధారం లేదు. వైట్ హౌస్ మాత్రం వాటిని కట్టుకథలేనని తేల్చిచెప్పింది.

# బ్యాంకులు ప్రజల కోసమా.. మీ కోసమా? : చంద్రబాబు ఆగ్రహం

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో బ్యాంకులపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల కోసం బ్యాంకులు ఏర్పాటు చేశారా? లేక.. మీ వ్యక్తిగత లాభాలు పెంచుకునేందుకు ఏర్పాటు చేశారా? అని నిలదీశారు. తాజాగా రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజలకు అనుకూలమైన విధానాలు తీసుకురావాలని తాను గతంలో అనేక సార్లు సూచించానని.. అయినా.. బ్యాంకర్లు నిబంధనల పేరుతో ప్రజలను ఇరకాటంలోకి నెడుతున్నాయని విమర్శించారు. నిబంధనలు ప్రజలకు మేలు చేసేలా ఉండాలని, కానీ, వారిని ఇబ్బంది పెట్టేలా ఉండకూడదని వ్యాఖ్యానించారు. "ప్రపంచం మారుతోంది. ప్రజలు మారుతున్నారు. కానీ, నిబంధనల పేరుతో మీరే(బ్యాంకులు) మారడం లేదు. ఇది సరికాదు. కాలానికి అనుగుణంగా మీరు మారాల్సిన అవసరం ఉంది." అని చంద్రబాబు తేల్చి చెప్పారు. ప్రజలకు, రైతులకు, విద్యార్థులకు కూడా అనుకూలంగా ఉండే విధానాలు అమలు చేస్తేనే బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటికే సగంకాలం గడిచిపోయిందన్న సీఎం చంద్రబాబు.. రైతులకు రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ ఎందుకు ఇవ్వలేక పోయారని బ్యాంకర్లను నిలదీశారు. అంతా అయిపోయిన తర్వాత.. రుణాలు ఇచ్చినా.. రైతులకు ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఒక కుటుంబం నుంచి ఒక పారిశ్రామిక వేత్త రావాలన్న స్ఫూర్తితో ప్రభుత్వం పనిచేస్తోందని.. దీనికి బ్యాంకర్ల సహకారం కోరుతున్నామని.. కానీ, ఎవరూ ముందుకు రావడం లేదని అన్నారు. 175 నియోజకవర్గాల్లో చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలను ఏర్పాటు చేయాలి నిర్ణయించామని.. దీనికి కూడా బ్యాంకర్లు సహకరించాలని కోరారు. %--%మీ స్పందన సరిగా లేకపోతే.. ప్రభుత్వం నుంచి కూడా అలానే స్పందన ఉంటుంది.%--% అని చంద్రబాబు తొలిసారి హెచ్చరించారు.

**నియంత్రణ ఎవరికి?**

బ్యాంకులు వివిధ రూపాల్లో నియంత్రణ విధిస్తున్నాయని.. చిన్న మొత్తం అప్పునకే ప్రజలను బ్యాంకుల చుట్టూ పత్రాల కోసం తిప్పుతున్నారని అన్నారు. ఇలాంటి నియంత్రణలు ఎందుకని ప్రశ్నించారు. ప్రజలను నియంత్రించడం వల్ల బ్యాంకులు పుంజుకుంటాయా? అని ప్రశ్నించారు. తదుపరి సంస్కరణల దిశగా ప్రజలను ప్రోత్సహించాల్సిన బ్యాంకులే ఇంకా నిబంధన చట్రం నుంచి బయటకు రాలేక పోతున్నాయన్నారు. బ్యాంకులు తమ తీరును మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

## 2011 వరల్డ్ కప్ ఫైనల్‌లో యువరాజ్ కంటే ముందుగా ధోనీ బ్యాటింగ్.. కారణాలు చెప్పిన సచిన్




**హైదరాబాద్ పెన్ పవర్:** 2011 ప్రపంచ కప్ ఫైనల్ అందరికీ గుర్తుండే ఉంటుంది. 2011, ఏప్రిల్ 2న వాంఖడే వేదికగా శ్రీలంకతో జరిగిన ఫైనల్ పోరులో ధోని సేన 6 వికెట్ల తేడాతో విజయం సాధించి రెండోసారి వన్డే ప్రపంచ కప్‌ను ముద్దాడింది. ఇండియన్ క్రికెట్ ఫ్యాన్స్ కు అది ఎప్పటికీ మర్చిపోలేని మ్యాచ్. ముఖ్యంగా ఈ మ్యాచ్ లో ధోని కొట్టిన విన్నింగ్ షాట్ ఇప్పటికీ అభిమానుల కళ్ల ముందు కదలాడుతూనే ఉంటుంది. టోర్నీ మొత్తం విఫలమైన ధోనీ ఫైనల్లో మాత్రం చెలరేగి ఆడాడు. జట్టు క్లిష్ట పరిస్థుల్లో ఉన్నప్పుడు వచ్చి మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడాడు. శ్రీలంకతో జరిగిన ఫైనల్లో సగటు క్రికెట్ అభిమానికి ఒక ఆలోచన మైండ్ లో ఉంటూనే ఉంటుంది. 2011 లో టీమిండియా బ్యాటింగ్ ఆర్డర్ ను గమనిస్తే యువరాజ్ సింగ్ తర్వాత ధోనీ బ్యాటింగ్ కు దిగేవాడు. ఫైనల్ ముందు వరకు ఎలాంటి మార్పు జరగలేదు. అయితే ఫైనల్లో మాత్రం మూడో వికెట్ పడిన తర్వాత ఐదో స్థానంలో బ్యాటింగ్ కు రావాల్సిన యువరాజ్ స్థానంలో కెప్టెన్ ధోనీ బరిలోకి దిగాడు. అప్పటివరకు బ్యాటింగ్ లో ఫామ్ లో లేని ధోనీ.. యువీ కంటే ముందుగా రావడం చూసి స్టేడియంలో ఫ్యాన్స్ ఆశ్చర్యానికి గురయ్యారు. దీని వెనుక అసలు కారణం టీమిండియా దిగ్గజం సచిన్ చెప్పుకొచ్చాడు.

సచిన్ మాట్లాడుతూ యువరాజ్ కంటే ధోనీ ముందుగా రావడానికి రెండు కారణాలను వివరించాడు. " రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి లెఫ్ట్-రైట్ కాంబినేషన్. లంక జట్టులో ఇద్దరు ఆఫ్-స్పిన్నర్లు ఉండడంతో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. అలాగే ఐపీఎల్ లో చెన్నై సూపర్ కింగ్స్ తరపున మురళీధరన్ ఆడాడు. 2011 వరల్డ్ కప్ ముందువరకు మురళీ బౌలింగ్ ను నెట్స్ లో ధోనీ మూడు సీజన్ ల పాటు ఆడాడు". అని టెండూల్కర్ చెప్పుకొచ్చాడు. టీమిండియా స్కోర్ 114 పరుగుల వద్ద కోహ్లీ ఔటైనప్పుడు ధోనీ క్రీజ్ లోకి వచ్చాడు. గంభీర్ తో కలిసి 109 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పి వరల్డ్ కప్ ను అందించాడు.

1983 తర్వాత భారత జట్టు గెలిచిన రెండో వన్డే ప్రపంచ కప్.. 2011. ఫైనల్‌లో శ్రీలంకను ఓడించి ధోని సేన 2011 వన్డే ప్రపంచకప్ ట్రోఫీని ఎగరేసుకుపోయింది. 275 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన మెన్ ఇన్ బ్లూ 48.2 ఓవర్లలో దానిని ఛేదించింది. గౌతమ్ గంభీర్ (97), ఎంఎస్ ధోని (91నా) స్టార్ పెర్ఫార్మర్లు కాగా, విరాట్ కోహ్లి (35), యువరాజ్ సింగ్ (21నా) భారత్ పరుగుల వేటలో సహకారం అందించారు.

# ఆసియా కప్‌లో భారత్‌పై రెండు మ్యాచులు మేమే గెలుస్తం: పాక్ బౌలర్ హారిస్ రవూఫ్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా కప్ ప్రారంభానికి ముందే భారత్, పాకిస్థాన్ మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఇండియాను చిత్తుగా ఓడిస్తామంటూ పాక్ ఆటగాళ్లు, మాజీలు ప్రగల్భాలు పలుకుతున్నారు. తాజాగా పాక్ సీనియర్ బౌలర్ హారిస్ రవూఫ్ కూడా ఇవే తరహా వ్యాఖ్యలు చేశాడు. ఆసియా కప్‌లో భారత్‌తో జరిగే రెండు మ్యాచులు మేమే గెలుస్తామని బీరాలు పలికాడు. ఆసియా కప్?లో భారత్, పాక్ మ్యాచ్ గురించి ఓ అభిమాని అడిగిన ప్రశ్నలకు రవూఫ్ బదులిస్తూ.. 'ఇండియాతో జరిగే రెండు మ్యాచ్‌లు మేమే గెలుస్తాం.. దేవుడి ఆశీర్వాదం మాపై ఉంది' అన్నాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారగా.. హారిస్ రవూఫ్ అతివిశ్వాసంపై నెటిజన్లు ట్రోల్స్ చేస్తున్నారు. "మీరు గెలిచేది లేదు.. సచ్చేది లేదు.. అన్ని ఉద్దేర మాటలే" అంటూ ఇండియన్ క్రికెట్ ఫ్యాన్స్ రవూఫ్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తున్నారు. పాకిస్థాన్ ఆసియా కప్ జట్టులో హారిస్ రవూఫ్ ఎంపికైన విషయం తెలిసిందే. 2025, సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు దుబాయ్, అబుదాబి వేదికగా ఆసియా కప్-2025 జరగనుంది. ఈ సారి టీ20 ఫార్మాట్‌లో జరగనున్న ఈ కాంటినెంటల్ టోర్నీలో పాకిస్తాన్, ఇండియా, ఒమన్, యూఏఈ జట్లు గ్రూప్ ఏలో తలపడనున్నాయి. సెప్టెంబర్ 14న చిరకాల ప్రత్యర్థులు ఇండియా, పాకిస్థాన్ తలపడనున్నాయి. సమీకరణలన్నీ అనుకున్నట్లుగా జరిగితే సూపర్?4 స్టేజ్‌లో ఒకసారి, ఫైనల్ పోరులో మరోసారి ఇండియా, పాకిస్థాన్ జట్లు తలపడే అవకాశం ఉంది.

క్రికెట్‌లో ఇండియా, పాక్ మ్యాచ్?కు ఉండే క్రేజ్ వేరే. దాయాదుల పోరు కోసం ఇరుదేశాల క్రికెట్ ఫ్యాన్సే కాకుండా యావత్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ ప్రియులు ఎంతో ఆతృతగా ఎదురు చూస్తారు. అయితే, ఆసియా కప్?లో భారత్ పాక్ ఆడనున్న మ్యాచ్?లపై సంధిగ్ధం నెలకొంది. ఇటీవల భారత్ పాకిస్థాన్ మధ్య చోటు చేసుకున్న సైనిక ఘర్షణల వల్ల పాక్ మ్యాచ్‌ను భారత్ ఈ మ్యాచును బైకాట్ చేసే అవకాశం ఉన్నట్లు క్రీడా వర్గాల్లో ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇదే జరిగితే మాత్రం క్రికెట్ ప్రియులకు తీవ్ర నిరాశ అనే చెప్పవచ్చు.

**ఆసియా కప్ 2025 పాకిస్తాన్ జట్టు:** సల్మాన్ అలీ అఘా (కెప్టెన్), అబ్రార్ అహ్మద్, ఫహీమ్ అష్రఫ్ , ఫఖర్ జమాన్ , హారీస్ రవూఫ్, హసన్ అలీ , హసన్ నవాజ్, హుస్సేన్ తలత్, ఖుష్దిల్ షా, మహ్మద్ వపెర్జ్, మొహమ్మద్ వాపెర్జ్ (వికెట్, మొహమ్మద్ వాపెర్జ్), సాహిబ్జాదా ఫర్హాన్, సైమ్ అయూబ్, సల్మాన్ మీర్జా, షాహీన్ షా అఫ్రిది, సుఫ్యాన్ మోకిమ్.

## ధోనీ కాదు.. ఇండియాలో అతడే నెంబర్ వన్ వికెట్ కీపర్: టీమిండియా మాజీ ఫీల్డింగ్ కోచ్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియా క్రికెట్ చరిత్రలో బెస్ట్ వికెట్-కీపర్ అంటే ఎవరికైనా ఠక్కున మహేంద్ర సింగ్ ధోనీ చెప్పేస్తారు. రెండు దశాబ్దాలుగా వికెట్ కీపింగ్ పై ధోనీ వేసిన ముద్ర అలాంటిది. స్టంప్స్ వెనకాల కూల్ గా ఉంటూ ప్రత్యర్థులకు తన కీపింగ్ నైపుణ్యాలతో చెమటలు పట్టిస్తాడు. మహేంద్రుడు వికెట్ల వెనకాల ఉంటే క్రీజ్ ధాటి రావడానికి కూడా బ్యాటర్లు సందేహిస్తారు. ముఖ్యంగా స్టంపింగ్ లో ధోనీకి తిరుగులేదు. ఇప్పటివరకు ఎన్నో మెరుపు స్టంపింగ్ లతో క్రేజీ స్టంపింగ్స్ చేశాడు. అయితే టీమిండియా మాజీ ఫీల్డింగ్ కోచ్ ఆర్. శ్రీధర్ మాత్రం ధోనీని పొగుడుతూనే టీమిండియా బెస్ట్ వికెట్ కీపర్ గా మరొకరిని ఎంచుకున్నాడు.

ఆర్. శ్రీధర్ ఎంఎస్ ధోని కంటే వృద్ధిమాన్ సాహా బెటర్ వికెట్ కీపర్ అని తన అభిప్రాయాన్ని తెలిపాడు. సాహా నైపుణ్యాలను ప్రశంసిస్తూ శ్రీధర్ ఇలా మాట్లాడాడు. "సాహా అద్భుతమైన వికెట్ కీపర్. వికెట్ కీపింగ్ చేసేటప్పుడు తన పట్టుదలను చూపిస్తాడు. గ్లోవ్స్ వేసుకుంటే తన ఆటిట్యూడ్ ఇంకోలా ఉంటుంది. జట్టు కోసం ఊహించని స్కిల్స్ తనలో బయటపెడతాడు. ఎక్కువగా మాట్లాడకపోయినా సాహా వికెట్ల వెనకాల ఉంటూ కెప్టెన్ కు కాన్ఫిడెన్స్ ఇస్తూ ఉంటాడు. ఎంఎస్ ధోని కంప్లీట్ ప్యాకేజీ. అతను అన్ని విభాగాల్లో కలిపి నెంబర్ వన్. కానీ వికెట్ కీపర్ విషయంలో మాత్రం వృద్ధిమాన్ సాహా అగ్రస్థానంలో ఉన్నాడు". అని శ్రీధర్ తెలిపాడు. 2010లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన సాహా భారత జట్టు తరఫున 40 టెస్టులు, 9 వన్డేలు ఆడాడు. 11 ఏళ్ల సాహా టెస్ట్ కెరీర్‌లో 92 క్యాచ్‌లు, 12 స్టంపింగ్‌లు ఉన్నాయి. 2014లో ఎంఎస్ ధోని టెస్ట్ క్రికెట్ నుండి రిటైర్ అయ్యాక.. రిషబ్ పంత్ రాకముందే భారత టెస్ట్ జట్టుకు సాహానే దిక్కు. బ్యాటింగ్ కంటె కూడా ఎక్కువగా తన కీపింగ్ స్కిల్స్ తో ఆకట్టుకునేవాడు. ఎన్నో స్టన్నింగ్ క్యాచ్ లు, మెరుపు స్టంపింగ్స్ చేసి మ్యాచ్ లను మలుపు తిప్పిన రోజులు కూడా ఉన్నాయి. ఎన్నో విలువైన ఇన్నింగ్స్‌లు ఆడినప్పటికీ, తగిన గుర్తింపు పొందలేకపోయాడు. 2021లో సాహా తన చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు.

# రేర్ ప్లాన్ ను అమలు పరిచిన టాక్సిక్ టీమ్!





అప్పటివరకు కేవలం కన్నడ ప్రేక్షకులకే పరిచయమైన యష్ లైఫ్ ను కెజిఎఫ్ సినిమా ఒక్కసారిగా మార్చేసింది. కెజిఎఫ్2 తర్వాత యష్ రాక్‌స్టార్ కూడా అయ్యారు. ఆ రెండు సినిమాలతో పాన్ ఇండియా స్థాయిలో సక్సెస్ తో పాటూ గుర్తింపును తెచ్చుకున్న యష్ తర్వాత ఏ సౌత్ స్టార్ డైరెక్టర్‌తోనో లేదా బాలీవుడ్ కమర్షియల్ డైరెక్టర్ తోనో సినిమా చేస్తారనుకున్నారు.

### లేడీ డైరెక్టర్‌తో యష్ మూవీ

కానీ యష్ మాత్రం అందరినీ ఆశ్చర్యపరుస్తూ లేడీ డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో ఓ సినిమాను అనౌన్స్ చేశారు. టాక్సిక్ టైటిల్ తో తెరకెక్కుతున్న ఈ సినిమా డ్రగ్స్ నేపథ్యంలో తెరకెక్కనుండగా, గీతూ ఈ సినిమాను ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా ఏకకాలంలో ఇంగ్లీష్ లో కూడా రూపొందుతుంది. టాక్సిక్ కోసం పలు హాలీవుడ్ టెక్నీషియన్లు కూడా వర్క్ చేస్తున్నారు.

### 45 రోజుల యాక్షన్ షెడ్యూల్

శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమాకు సంబంధించి ఓ ఇంట్రెస్టింగ్ అప్డేట్ వినిపిస్తోంది. ఈ సినిమా కోసం మేకర్స్ 45 రోజుల యాక్షన్ షెడ్యూల్ ను ప్లాన్ చేశారని తెలుస్తోంది. ఇది చాలా రేర్ గా జరుగుతూ ఉంటుంది. ఎప్పుడైనా సరే మేకర్స్ ఒకేసారి యాక్షన్ సీన్స్ ను తెరకెక్కించరు. బ్రేక్ తీసుకుంటూ పలు షెడ్యూల్స్ లో యాక్షన్ పార్ట్ ను పూర్తి చేస్తారు కానీ టాక్సిక్ టీమ్ మాత్రం ఈ 45 రోజుల షెడ్యూల్ లోనే కీలకమైన యాక్షన్ సీన్స్ షూటింగ్ ను చేయనున్నట్టు తెలుస్తోంది.

### హాలీవుడ్ స్టంట్‌మాస్టర్ నేతృత్వంలో..

హాలీవుడ్ స్టంట్ మాస్టర్ జేజే పెర్రీ మరియు ఇంకొందరు ఈ షెడ్యూల్ ను మానిటరింగ్ చేస్తున్నారు. కాగా యష్ ఈ సినిమా కోసం చాలా కొత్త లుక్ లోకి మేకోవర్ అయ్యారు. ఇప్పటికే కొంత భాగం షూటింగ్ పూర్తవగా ఆ అవుట్‌పుట్‌తో మేకర్స్ హ్యాపీగా ఉన్నారు. కియారా అద్వానీ హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాలో నయనతార, తారా సుతారియా, హుమా ఖురేషి, రుక్మిణి వసంత్, టోవినో థామస్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అనిరుధ్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది.



ప్రతి లుక్‌ని ఎలా రాక్ చేయడం శ్రీముఖికి తెలుసు

జాన్వీ కపూర్ ఫ్యాషన్ మీరు స్టార్లను చూస్తారు

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com